సమస్త ప్రక్షాళనం

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్



ప్రచురణ : సంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 139, ఎడిటర్ : జె. భాస్కర్, బుధవారం 17-06-2026 పేజీలు : 12 వెల : 2/-



## ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ విస్తరణ తప్పనిసరి- లేకపోతే సంస్కరణలు విఫలమే: భారత్

- కేవలం తాత్కాలిక సభ్యుల సంఖ్య పెంచితే ప్రయోజనం లేదన్న భారత్
- శాశ్వత సభ్యుల విస్తరణ ద్వారానే నిర్ణయాధికారంలో సమతుల్యత సాధ్యమని స్పష్టం
- భద్రతా మండలి సంస్కరణలపై చర్చలు ప్రారంభించాలని డిమాండ్

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలు కేవలం తాత్కాలిక సభ్యుల విస్తరణకే పరిమితమైతే అవి పూర్తిగా విఫలమైనట్లేనని భారత్ స్పష్టం చేసింది. శాశ్వత సభ్యుల విభాగాన్ని విస్తరించకుండా చేపట్టే ఏ సంస్కరణ అయినా అసలు లక్ష్యాన్ని చేరుకోలేదని హెచ్చరించింది. ప్రపంచ రాజకీయ, ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా భద్రతా మండలిలో సమూల మార్పులు అవసరమని మరోసారి నొక్కి చెప్పింది.

భద్రతా మండలి సంస్కరణలపై జరిగిన ఇంటర్- గవర్నమెంటల్ నెగోషియేషన్స్ (ఐజీఎన్) సమావేశంలో ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి రాయబారి హరీశ్ పర్వతనేని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న ఐదుగురు శాశ్వత సభ్యుల ఆధిపత్యం కొనసాగుతుండగా, కేవలం తాత్కాలిక సభ్యుల సంఖ్య పెంచడం వల్ల నిర్ణయాధికార వ్యవస్థలో ఎలాంటి మార్పు రాదని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో



# సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి

- వ్యవసాయ శాఖపై సీఎం సమీక్ష
- ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యత అప్పగించాలని ఆదేశం

విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యచరణ అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్ సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. బోనస్ వచ్చే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలని అన్నారు. రామగుండం కర్మాగారంలో ఉత్పత్తయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, ఎరువులపై వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం తెలిపారు.

2

## హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు - రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సమంజసం కాదు



- రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని వెల్లడి
- కేంద్రానికి రేవంత్, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా

2లో

## పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్..

రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ్ రావు ఫైర్!



- గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం జరిగిందన్న హరీశ్
- తమ శాఖల్లో ఏం జరుగుతోందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా
- పిల్లలకు ఇచ్చే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా అని మండిపాటు

2లో



2లో

ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి ఉండదని అంగీకరించింది :

## డీల్ తర్వాత ట్రంప్ ప్రకటన

- ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి ఉండదని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- ఇరాన్‌కు 300 మిలియన్ డాలర్లు ఇస్తున్నామన్న వార్తలను ఖండించిన ట్రంప్
- ఇరాన్ అణ్వాయుధాలను సంపాదించడానికి ఎప్పటికీ అనుమతించబోమన్న ఇజ్రాయెల్ ప్రధాని



2లో

## నీట్ రీ-ఎగ్జామ్- పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు

- నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఆన్‌లైన్ ప్రచారాలను నమ్మవద్దు
- అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలి
- నీట్ రీ ఎగ్జామ్ వేళ పలు సూచనలు చేసిన ఎన్‌టీఏ
- అందుబాటులో ఆన్‌లైన్ పోర్టల్



2లో

## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు.. తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

- తెలంగాణ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న బండి సంజయ్
- అక్రమ వలసదారుల ఓట్లపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్న
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని వ్యాఖ్య

## అడవిలో అన్నలపై కవిత కీలక వ్యాఖ్యలు



2లో

## ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?



2లో

- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు
- ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే ఉపయోగించాలి

రాహుల్ గాంధీ ఒక పెద్ద జోక్- రాజకీయ

## పరిణతి లేని లీడర్ : డీఎంకే ఫైర్

- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించిన డీఎంకే
- రాహుల్‌ను ఒక జోక్‌గా పేర్కొన్న స్టాలిన్ పార్టీ
- ప్రతిపక్షాల ఐక్యతను రాహుల్ బలహీనపరుస్తున్నారని డీఎంకే పత్రిక మురసొలిలో సంపాదకీయం



2లో

# సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి

**రైతుల వివరాల నమోదు :** రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని సీఎం అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో రానున్న వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సూచనలను సమీక్షించారు. వచ్చే సీజన్ కొనుగోళ్ల సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు.

**అందుబాటులో 7 రకాల సన్న వడ్ల విత్తనాలు :** కనీస మద్దతు ధరలు కేంద్రం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.

ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు.

**సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం :** వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని చెప్పారు.

**రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ :** ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రైతు వేదికలను పూర్తిగా రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

**ప్రభుత్వ డైరీ మరింత బలోపేతం :** గతంలో రూ.13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల దిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు.

# ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ విస్తరణ తప్పనిసరి- లేకపోతే సంస్కరణలు విఫలమే: భారత్

**సంస్కరణలకు అర్థం ఉండదు!**

"భద్రతా మండలి సంస్కరణలు కేవలం తాత్కాలిక సభ్యుల విస్తరణకే పరిమితమైతే అవి అసంపూర్ణమైనవే కాకుండా విఫలమైనట్లుగా పరిగణించాల్సి వస్తుంది. పీ5 దేశాల నిర్ణయాధికార నిర్మాణంలో మార్పు రాకపోతే సంస్కరణలకు అర్థం ఉండదు" అని పర్వతనేని అన్నారు. ప్రస్తుతం ఐరాస భద్రతా మండలిలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు శాశ్వత సభ్యులుగా ఉన్నాయి. వీటికి వీటో అధికారం ఉంది. ప్రపంచ జనాభా, ఆర్థిక శక్తి, భౌగోళిక రాజకీయ పరిణామాల్లో వచ్చిన మార్పులను ప్రతిబింబించేలా భద్రతా మండలిని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని భారత్ ఎన్నో ఏళ్లుగా వాదిస్తోంది. భారత్‌తో పాటు జర్మనీ, జపాన్, బ్రెజిల్ దేశాలు కలిసి జీ-4 కూటమిగా శాశ్వత సభ్యత్వ విస్తరణకు మద్దతు తెలుపుతున్నాయి. అలాగే ఎల్-69, కరీబియన్ దేశాల సమాఖ్య (కారికామ్) వంటి అనేక దేశ సమూహాలు కూడా ఈ డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నాయని భారత్ గుర్తుచేసింది.

**వాస్తవాలకు విరుద్ధం**

ఐజీఎన్ సమావేశంలో చర్చకు తీసుకొచ్చిన "ఎలిమెంట్స్ పేపర్"పై కూడా భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పత్రంలో సభ్య దేశాల అభిప్రాయాలను సరిగా ప్రతిబింబించలేదని విమర్శించింది. శాశ్వత సభ్యుల విస్తరణకు మెజారిటీ దేశాలు మద్దతు ఇస్తున్నప్పటికీ, దానిని కేవలం "గణనీయ సంఖ్యలో ప్రతినిధుల అభిప్రాయం"గా పేర్కొనడం వాస్తవాలకు విరుద్ధమని తెలిపింది. జాతీయ ప్రకటనల ద్వారా, అలాగే జీ-4, ఎల్-69, కారికామ్ వంటి వేదికల ద్వారా శాశ్వత సభ్యత్వ విస్తరణకు దేశాలు స్పష్టంగా మద్దతు ప్రకటించాయని పర్వతనేని వివరించారు. అయినప్పటికీ వాటిని సరైన రీతిలో నమోదు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని ప్రతిపాదనల్లో ప్రాంతాల వారీగా స్థిరమైన సీట్లు కల్పించే అంశాన్ని ప్రస్తావించడం పైనా భారత్ అభ్యంతరం తెలిపింది. అలాంటి ప్రతిపాదనలు శాశ్వత సభ్యత్వ విస్తరణగా పరిగణించలేమని పేర్కొంది. అంతేకాకుండా, ఆ స్థానాల్లో ఉండే దేశాలు తమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించకుండా జాతీయ హోదాలోనే వ్యవహరిస్తే ప్రాంతీయ సమతుల్యత లక్ష్యం నెరవేరదని తెలిపింది. చిన్న ద్వీప దేశాల సమూహం (స్మాల్ ఐలాండ్ డెవలపింగ్ స్టేట్స్ - ఎస్ఐడీఎస్) ప్రయో జనాలు కూడా ఇలాంటి ప్రతిపాదనల వల్ల దెబ్బతినే అవకాశం ఉందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దేశాల ప్రయోజనా లను భారత్ ఎప్పటినుంచో సమర్థిస్తోందని గుర్తు చేసింది.

**కొత్త నిర్వచనాలు అవసరం**

అదేవిధంగా, "పర్మనెన్సీ" అనే అంశంపై మరింత చర్చ అవసరమని ఎలిమెంట్స్ పేపర్‌లో పేర్కొనడాన్ని కూడా భారత్ తప్పుబట్టింది. ఐరాస చార్టర్‌లోనే శాశ్వత, తాత్కాలిక సభ్యుల మధ్య స్పష్టమైన విభజన ఉందని తెలిపింది. ఆ నిర్వచనంపై ఎలాంటి సందిగ్ధత అవసరం లేదని పేర్కొంది. ఐరాస చార్టర్‌లోని 23వ అధికరణ ప్రకారం భద్రతా మండలిలో సభ్యులను శాశ్వత, తాత్కాలిక విభాగాలుగా స్పష్టంగా విభజించారని పర్వతనేని గుర్తు చేశారు. కాబట్టి శాశ్వత సభ్యత్వానికి కొత్త నిర్వచనాలు అవసరం లేదని అభిప్రాయపడ్డారు. భద్రతా మండలి సంస్కరణల ప్రక్రియ దశాబ్దాలుగా నత్తనడకన సాగుతోందని భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇకపై చర్చలు పాఠ్య ఆధారితంగా జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఇతర ఐరాస ప్రక్రియల్లాగే ఒక స్పష్టమైన ముసాయిదా పాఠ్యాన్ని రూపొందించి, దానిపై సభ్య దేశాలు చర్చించాలనే అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఐజీఎన్ సహ-అధ్యక్షులు ముందడుగు వేసి నిర్దిష్ట కాలపట్టిక, మైలురాళ్లతో కూడిన పాఠ్యాన్ని రూపొందించాలని భారత్ కోరింది. అవసరమైతే ఆ తర్వాతే మధ్యవర్తిత్వ ప్రతిపాదనలను పరిశీలించవచ్చని తెలిపింది. "అన్నింటిపై ఏకాభిప్రాయం కుదిరే వరకు ఏదీ ఆమోదం పొందదు" అనే విధానాన్ని ప్రస్తుత పరిస్థితిని కొనసాగించేందుకు కొందరు ఉపయోగించుకుంటున్నారని భారత్ విమర్శించింది. ఈ విధానం భద్రతా మండలిలో ఉన్న అసమానతలను మరింత బలపరుస్తోందని పేర్కొంది. 21వ శతాబ్దపు ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా ఐరాస భద్రతా మండలిని మరింత ప్రజాస్వామ్యబద్ధంగా, సమతుల్యంగా మార్చాల్సిన అవసరం ఉందని భారత్ మరోసారి స్పష్టం చేసింది. శాశ్వత సభ్యత్వ విస్తరణతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడమే నిజమైన సంస్కరణల లక్ష్యమని తెలిపింది.

# హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు - రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సమంజసం కాదు : కిషన్ రెడ్డి

గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకారమవుతాయని పేర్కొన్నారు.

**తెలంగాణ ప్రజలకు జవాబుదారీ:** తెలంగాణ కావున, కిషన్‌రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని, అనాలోచితంగా, దుందుడు కుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని హితవు కిషన్ రెడ్డి పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తామ రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు.

**హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం :** తెలంగాణ అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పని చేశామని, ఇప్పుడూ పని చేస్తామని, తెలంగాణకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశానని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దిల్లీకు వచ్చి రెండుసార్లు ధర్నా చేశామని గుర్తు చేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని గుర్తు చేశారు.

**ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించాం :** తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితవు పలికారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితే రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టలేదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 కోసం కేసీఆర్ సహకరించకలేదని ఆరోపించారు. కేసీఆర్ సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించామన్నారు. తెలంగాణకు రాదనుకున్న రైల్వే ఫ్యాక్టరీని సాధించామని, ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు.

**రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించింది :** మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలేనని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్ల వడ్డీ లేకుండా ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్‌సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.

**ప్రాజెక్టులకు సహకరిస్తాం :** ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందని, ప్రాజెక్టులు ఆపే సంస్కృతి బీజేపీకి లేదని అది కాంగ్రెస్‌కే ఉండవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. డొంకదారిన ప్రాజెక్టులు అడ్డుకోవాల్సిన కర్మ తమకు లేదని, రేవంత్ రెడ్డి కోసమో, మరెవరి కోసమో ప్రాజెక్టులు అడ్డుకోమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రాజెక్టులకు సహకరిస్తామని స్పష్టం చేశారు. "మెట్రో ఫేజ్ 2 మరింత వేగవంతానికి నేను సీఎంకు లేఖలు రాశా. ఐఆర్ఎఫ్‌సీతో ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు తీసుకునేందుకు కేంద్రం సహకరించింది. రుణ ఒప్పందం విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. మెట్రో-1 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రుణం తీసుకుంటోంది. రుణం విషయమై రాష్ట్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ మధ్య ఒప్పందం జరిగింది.

టికెట్లు, యాడ్ ఆదాయాన్ని ముందుగా అప్పు చెల్లించాలని ఒప్పందం జరిగింది. ఈ విషయమై కేంద్ర సూచనలకు సీఎం అంగీకరించట్లేదని చెప్పారు. అన్ని మెట్రోలు తీసుకున్న రుణాలు వాటికే ముందుగా చెల్లించరు. రెగ్యులర్ మెట్రో ఆపరేషన్, నిర్వహణకు ముందుగా వచ్చిన ఆదాయం చెల్లించాలి. ఆ తర్వాతే రుణాలకు సంబంధించి మిగతా డబ్బులు చెల్లించాలి"

# ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి ఉండదని అంగీకరించింది : డీల్ తర్వాత ట్రంప్ ప్రకటన

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇకపై అణ్వాయుధాలను కలిగి ఉండబోదని, ఆ దేశం ఇందుకు అంగీకరించిందని ఆయన ప్రకటించారు. ఇదే సమయంలో ఇరాన్‌కు అమెరికా 300 మిలియన్ డాలర్లు చెల్లించనుందన్న వార్తలను పూర్తిగా ఖండించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు.

**ఒప్పందం ఉన్నా లేకపోయినా ఇరాన్‌కు అణ్వాయుధాలు ఉండవు: నెతన్యాహు :** ఇదిలా ఉండగా అమెరికా-ఇరాన్ మధ్య కొత్త శాంతి ఒప్పందం ప్రకటించిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి తన కఠిన వైఖరిని స్పష్టం చేశారు. ఒప్పందం ఉన్నా లేకపోయినా ఇరాన్ అణ్వాయుధాలను సంపాదించడానికి ఎప్పటికీ అనుమతించబోమని ఆయన ప్రకటించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నెతన్యాహు మాట్లాడుతూ, ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని అడ్డుకోవడం తన రాజకీయ జీవితంలో అత్యంత ముఖ్యమైన లక్ష్యమని పేర్కొన్నారు. 'దశాబ్దాలుగా ఇరాన్ అణ్వాయుధాలను పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాను. దీనిని నా జీవిత లక్ష్యంగా చెప్పవచ్చు. ఇప్పటి వరకు దానిని కాపాడాను. భవిష్యత్తులో కూడా అదే విధంగా కొనసాగిస్తాను. అంతేకాకుండా ఒప్పందం ఉన్నా లేకపోయినా ఇరాన్ అణ్వాయుధాలను పొందదు. ఈరోజు కాదు, రేపు కాదు. నేను ఇజ్రాయెల్ ప్రధానిగా ఉన్నంతకాలం అది జరగదు' అని నెతన్యాహు ఆయన తెలిపారు.

**జేడీ వాన్స్ స్పష్టీకరణ..** ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ అంశంపై స్పందించారు. ఇప్పటికే డిజిటల్ విధానంలో ఒప్పందంపై సంతకాలు పూర్తయ్యాయని తెలిపారు. అయితే ఆర్థిక ఆంక్షల సడలింపు తక్షణమే అమల్లోకి రాదని స్పష్టం చేశారు. ఇరాన్ తన వద్ద ఉన్న సుసంపన్న యురేనియం నిల్వలను తగ్గించడం, అంతర్జాతీయ తనిఖీ వ్యవస్థకు పూర్తిస్థాయిలో సహకరించడం వంటి చర్యలు తీసుకుంటేనే ఆంక్షల సడలింపు అమలవుతుందని చెప్పారు.

**అమెరికా-ఇరాన్ ఒప్పందం ఏమిటి?..** డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం ఇరాన్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం భవిష్యత్ చర్చలు, ద్వైపాక్షిక సంబంధాలకు ఒక రూపకల్పనను అందిస్తుందని అమెరికా అధికారులు తెలిపారు. ఇరాన్ అణు కార్యక్రమంపై అంతర్జాతీయ తనిఖీలకు సహకరించడం, అణ్వాయుధాల అభివృద్ధి జరగకుండా ధృవీకరణ చర్యలకు అంగీకరించడం, ప్రాంతీయ తీవ్రవాదానికి మద్దతు ఇవ్వకపోవడం వంటి అంశాలను ఒప్పందంలో చేర్చినట్లు వెల్లడించారు. ఇరాన్ తన అణు కార్యక్రమంపై పూర్తి స్థాయి తనిఖీలకు అనుమతిస్తే, అలాగే ప్రాంతీయ తీవ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వకుండా వ్యవహరిస్తే, దశలవారీగా ఆర్థిక ఆంక్షల సడలింపులు అమల్లోకి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఇరాన్ అంతర్జాతీయ బాధ్యతలను పాటిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తిరిగి చురుకైన పాత్ర పోషించే అవకాశాలు కల్పించాలనే ఉద్దేశం ఉందని అమెరికా అధికారులు పేర్కొన్నారు. ఆంక్షల సడలింపు పూర్తిగా ఇరాన్ చర్యలపై ఆధారపడి ఉంటుందని, ముందుగా అంగీకరించిన షరతులను అమలు చేసిన తర్వాతే తదుపరి దశలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు.

**జెనీవాలో అధికారిక సంతకాలు..**

ఈ ఒప్పందానికి సంబంధించిన అధికారిక సంతకాలు ఈ వారంలో జెనీవాలో జరగనున్నాయి. స్విట్జర్లాండ్ ఈ ప్రక్రియకు సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది. అమెరి కా, ఇరాన్, పాకిస్థాన్, ఖతార్ దేశాల భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహించనున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఈ అవగా హన ఒప్పందం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నంగా భావిస్తున్నారు. అయితే ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాంతీయ భద్రత, భవిష్యత్ దౌత్యపరమైన పరిణామాలపై మరింత చర్చకు దారితీశాయి.

# పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్.. రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ్ రావు ఫైర్!

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, టైల కోసం రూ. 1,200 కోట్లు.. ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు.

తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరుల య్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని.. అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు.

## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు.. తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారుల గురించి కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులతో ఇక్కడి ముస్లిం సమాజాన్ని పోల్చడం ద్వారా కాంగ్రెస్ వారిని అవమానిస్తోందని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్రం వేగంగా దూసుకుపోవాలంటే 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాలని, ఈసారి ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని ప్రజలను కోరారు. మావోయిస్టుల గురించి మాట్లాడుతూ... సమాజంలో తుపాకీ సంస్కృతి, మారణహోమంతో సాధించేది ఏమీ లేదన్నారు. ఏమీ తెలియని మైనర్ పిల్లల చేత తుపాకులు పట్టించడం అత్యంత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది మావోలు లొంగిపోయారని, ఇంకా ఆ ఆలోచనల్లో ఉన్నవారు భవిష్యత్తు కోసం మారాలని పిలుపునిచ్చారు.

## అడవిలో అన్నలపై కవిత కీలక వ్యాఖ్యలు

టీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత మావోయిస్టుల ఉనికిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో అడవుల్లో మావోయిస్టులు ఉన్న సమయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించేవారని, ప్రస్తుతం వారు లేకపోవడంతో అధికారుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని ఆమె పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆమె చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. తన వారం రోజుల పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లాలోని ఆర్కే-7 గని వద్దకు చేరుకున్న కవితను పోలీసులు, సింగరేణి భద్రతా సిబ్బంది గేటు వద్దే అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ కొద్దిసేపు వాగ్వాదం నెలకొంది. చివరకు ఆమె ఆంక్షలను అధిగమించి ముందుకు సాగి, కార్మికులతో సమావేశమయ్యారు. మందమర్రిలోని కాసిపేట-1 గని నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కవిత, పర్యటనలో రెండో రోజైన సోమవారం ఈ ఘటనను ఎదుర్కొన్నారు. గేట్ మీటింగ్ నిర్వహించకుండా అధికారులు అడ్డుకోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె ధ్వజమెత్తారు. గతంలో కార్మికుల సమస్యలపై రాహుల్ గాంధీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి ప్రాంతానికి వచ్చినప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. కేవలం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆమె ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తే టీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని కవిత హెచ్చరించారు. కార్మికుల సంక్షేమం, ఉపాధి సమస్యలు, ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ వంటి అంశాలపై నేరుగా కార్మికులతో చర్చించేందుకే తాము 'బాయి బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## నీట్ రీ-ఎగ్జామ్- పేపర్ లీక్ వదంతులను నమ్మొద్దు

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్‌కు సమయం దగ్గరపడుతున్న తరుణంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అలర్ట్ జారీ చేసింది. ప్రశ్నా పత్రాల లీకేజీ వదంతులను నమ్మవద్దని విద్యార్థులను సూచించింది. అలాగే, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని అభ్యర్థులను, వారి తల్లి దండ్రులను కోరింది. నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే, మోస పూరిత ప్రచారాలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్‌టీఏ ఒక ప్రత్యేకమైన ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబా టులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎవరైనా ఎగ్జామ్ ప్రశ్నాపత్రాలు ఇస్తామని డబ్బులు అడిగినా, లేదా లీక్ అయిందని తప్పుడు ప్రచారం చేసినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. అటువంటి మోసగాళ్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌టీఏ హెచ్చరించింది.

**ఆన్‌లైన్ మోసాలపై నిఘా..** ఇదిలా ఉండగా, నీట్ రీ ఎగ్జామ్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు అధికారులు అన్ని రకాలు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఆన్‌లైన్ మోసాలపై పర్యవేక్షణను కఠినతరం చేశారు. నీట్ పరీక్షా పత్రాలు తమ వద్ద ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తూ, అభ్యర్థులను మోసం చేయడానికి కొన్ని మోసపూరిత ముఠాలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రయత్నిస్తున్నాయని ఎన్‌టీఏ తెలిపింది. అయితే, పరీక్షకు ముందే ప్రశ్నపత్రం ఎవరికీ అందుబాటులో ఉండదని, పేపర్ తయారీ, నిల్వ, రవాణా వంటి ప్రక్రియల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

**అందుబాటులో అడ్మిట్ కార్డులు..** ఇక, నీట్ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది. వెబ్‌సైట్ ప్రారంభమైన మొదటి 24 గంటల్లోనే 10 లక్షల మందికి పైగా అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారని ఎన్‌టీఏ పేర్కొంది. కొన్నిచోట్ల డౌన్‌లోడ్ లింక్ సరిగ్గా పనిచేయకపోవడం వల్ల అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిసింది. అయితే, సాంకేతిక సమస్యలు, సర్వర్‌పై అధిక భారం కారణంగానే ఈ సమస్య తలెత్తిన్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. సమస్యలను పరిష్కరించే దిశగా తమ బృందం పనిచేస్తుందని పేర్కొంది.

## ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ జారీ చేసే ఆధార్ కార్డులను పౌరసత్వం, స్థానికత, నివాస చిరునామా రుజువులుగా ఉపయోగిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందనను కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం, అడ్వకేట్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ పిటిషన్‌ను ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఇలాంటి ఇతర కేసులతో జత చేసింది. ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగా ఉపయోగించేలా పరిమితం చేయాలని పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ కోరారు. దీనిని పౌరసత్వం, స్థానికత, చిరునామా, పుట్టిన తేదీకి రుజువుగా వాడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఎన్నికల సంఘానికి కూడా తగిన ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కోరారు. న్యాయవాది అశ్వినీ దూబే ద్వారా ఈ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేశారు. కొత్త ఓటరు నమోదు కోసం దరఖాస్తు ఫారమ్‌లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా ఆధార్‌ను ఉపయోగించడానికి పిటిషనర్ సవాల్ చేశారు. ఇది ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9, ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ)- 1950లోని సెక్షన్ 23(4), రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని పేర్కొన్నారు. "ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 చాలా స్పష్టంగా ఆధార్ అనేది పౌరసత్వం లేదా స్థానికతకు రుజువు కాదు అని చెబుతోంది. అలాగే 2023 ఆగస్టు 22 నాటి యూఐడీఏఐ నోటిఫికేషన్ కూడా ఆధార్ అనేది గుర్తింపునకు మాత్రమే రుజువు, పౌరసత్వం, చిరునామా, పుట్టిన తేదీకి కాదు అని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ పాఠశాల ప్రవేశాలు, ఆస్తి కొనుగోళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల కోసం వయస్సు, పౌరసత్వం, స్థానికత రుజువుగా ఆధార్‌ను ఉపయోగిస్తున్నారు. అంతేకాదు కొత్త ఓటరు నమోదు దరఖాస్తు ఫారమ్ (ఫారమ్-6)లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా కూడా వాడుతున్నారు. దీని వల్ల చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ రకాల అధికార పత్రాలు పొందుతున్నారు" అని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## రాహుల్ గాంధీ ఒక పెద్ద జోక్- రాజకీయ పరిణతి లేని లీడర్ : డీఎంకే ఫైర్

లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై డీఎంకే మండిపడింది. రాహుల్‌ను ఒక పెద్ద జోక్ అంటూ వెక్కిరించింది. కాంగ్రెస్ రాజకీయ మనుగడ కోసం పోరాడుతున్నప్పుడు తాము ఆ పార్టీని భుజాలపై మోశామని పేర్కొంది. కానీ ఒక కొత్త మెరిసే బొమ్మను (విజయ్‌ను ఉద్దేశించి) చూడగానే కాంగ్రెస్ పడవ నుంచి దూకేసిందని మండిపడింది. ఈ మేరకు డీఎంకే ఐటీ విభాగం హస్తం పార్టీపై విమర్శలు గుప్పిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది.

**'విపక్షాల చీలికకు రాహులే కారణం'..** మరోవైపు, ప్రతిపక్షాల ఐక్యతను రాహుల్ బలహీనపరుస్తున్నారని డీఎంకే పత్రిక మురసోలి ఆరోపించింది. ఇండియా బ్లాక్ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టింది. ప్రతిపక్ష పార్టీల మధ్య చీలికలకు కాంగ్రెస్ నాయకుడే స్వయంగా కారణమయ్యారని విమర్శించింది. అయితే ఇండియా కూటమిలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అంశాలకు తాము మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ ప్రతిపక్షాల ఐక్యత గురించి బోధిస్తూనే, దానిని బలహీనపరుస్తున్నారని మండిపడింది. ఈ మేరకు డీఎంకే పత్రిక మురసోలిలో సోమవారం ప్రచురితమైన సంపాదకీయంలో పేర్కొంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు- 2026లో డీఎంకేతో కలిసి కాంగ్రెస్ పోటీ చేసింది. ఈ క్రమంలో ఐదు అసెంబ్లీ సీట్లను హస్తం పార్టీ గెలుచుకుంది. ఆ తర్వాత డీఎంకే కూటమికి కటీఫ్ చెప్పి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో సంకీర్ణ భాగస్వామిగా చేరింది. దీంతో కాంగ్రెస్, డీఎంకే మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.

# ఎమ్మెల్యే యాదయ్యపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం:
# అక్నాపూర్ మాజీ సర్పంచ్ తలారి విజయ్ కుమార్ హెచ్చరిక

సమస్త ప్రక్షాళనం - నవాబ్‌పేట్, జూన్ 17:చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్యపై నిరాధారమైన విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, మాట్లాడే ముందు మీ గతాన్ని, చరిత్రను ఒకసారి గుర్తుచేసుకోవాలని అక్నాపూర్ మాజీ సర్పంచ్ తలారి విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిత్యం ప్రజల అందుబాటులో ఉంటూ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి, ప్రజల సుఖసంతోషాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్యపై విమర్శలు చేసే అర్హత కొందరికి లేదంటూ మండిపడ్డారు. మీలా కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయం చేయడం తమకు తెలియదని, గతంలో మీరు తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషనల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో నవాబ్‌పేట్ మండలానికి గానీ, చేవెళ్ల నియోజకవర్గానికి గానీ చేసిన అభివృద్ధి ఏంటో ముందు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీ సతీమణి వికారాబాద్ జిల్లా జెడ్పీటీసీగా పోటీ చేసిన కాలంలో, వారి పేరుపై నవాబ్‌పేట్ మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ కాంట్రాక్టులు తీసుకున్న విషయం నిజం కాదా అని



ప్రశ్నించారు.అక్నాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పనుల కారణంగా తవ్విన సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్‌ను పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల గ్రామ ప్రజలు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నవాబ్‌పేట్ మండలంలో మీరు ఎక్కడ కాంట్రాక్టులు తీసుకున్నా అక్కడ పనులన్నీ అరకొరగానే మిగిలిపోయాయని ఆరోపించారు. స్వలాభం కోసం ప్రజల సమయాన్ని, సమస్యలను గాలికి వదిలేసి, ఇప్పుడు నిస్వార్థంగా పనిచేసే ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో మీరు చేసిన అరాచకాలు, అవకతవకలు ప్రజలకు తెలియవని అనుకుంటే పొరపాటేనని, మీ చరిత్ర ఏంటో ఇక్కడి ప్రజలందరికీ బాగా తెలుసని పేర్కొన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే యాదయ్యపై అసత్య ప్రచారాలు, నిరాధార విమర్శలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో మీ అసలు నిజాలను, మోసాలను ప్రజల ముందు ఉంచి తగిన బుద్ధి చెప్తామని “తస్మాత్ జాగ్రత్త!“ అంటూ విజయ్ కుమార్ హెచ్చరించారు.

# ఫీట్ నెస్ లేని ప్రైవేటు పాఠశాలల
# బస్సులను వెంటనే సీజ్ చేయాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి

సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులు చెల్లుబాటు అయ్యే ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేకుండానే రోడ్లపై తిరుగుతున్నట్లు సమాచారం అందుతోందని తెలిపారు. వేలాది మంది విద్యార్థులు ప్రతిరోజూ ఈ బస్సుల్లో ప్రయాణిస్తున్నందున వారి ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు.
రవాణా శాఖ అధికారులు జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల



బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఫిట్నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్, పర్మిట్, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు, అత్యవసర భద్రతా పరికరాలు మరియు డ్రైవర్ల అర్హతలను పరిశీలించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుస్తున్న బస్సులను వెంటనే సీజ్ చేసి సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల ప్రాణాలతో రాజీ పడే పరిస్థితులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని, ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని అన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టి ఫిట్నెస్ లేని బస్సులను గుర్తించి రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని దత్తు రెడ్డి కోరారు.

# అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్యAIFDS
# ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పోరాటం

సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలి ప్రభుత్వ పాఠశాలలో సమయానికి అన్ని సబ్జెక్టులు వాటి పుస్తకాలు యూనిఫాంలో ఇవ్వాలి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు అరికట్టి ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేయాలి ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ ఉపాధ్యాయ ఎంఈఓ డిఓ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో



స్టేషనర్లను నిలిపివేయాలి స్టేషనరీ పెట్టిన పాఠశాల పర్మిషన్ రద్దు చేయాలి వెంటనే డిఎఫ్ ఆర్సి డిస్టిక్ ఫీజు రెగ్యులర్ కమిటీ వెయ్యాలి ప్రతి పాఠశాలలో ఫీజు వివరాల నోటీసు బోర్డులు పెట్టాలి విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రవేట్ విద్యాసంస్థలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25  శాతం సీట్లు, ఉచితంగా అందించాలి ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడిపే పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్. రవి. వేణు. తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం

### తోర్నల్ గ్రామ సర్పంచ్
### పి సంగమేశ్వర్ పాటిల్

సమస్త ప్రక్షాళనం :మనూర్, నారాయణ ఖేడ్ మనూరు మండలం తోర్నల్ గ్రామ ప్రభుత్వం పాఠశాలలో గ్రామ సర్పంచ్ పి ,సంగమేశ్వర పాటిల్ గారి చేతుల మీదుగా నూతన విద్యార్థులకు విద్యాభ్యాసం చేయించడం జరిగింది అనంతరం విద్యార్థులకు నూతన పాఠ్య  పుస్తకాలను తన చేతుల మీదుగా అందించడం



జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలలో వేసి పాఠశాలను బలపేతం చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగారెడ్డి గారు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి, మల్లికార్జున్ పాటిల్ గారు, యూత్ లీడర్ ఖలేద్, కొటారి నరసింహులు,కోటారి లాలప్ప, శివకుమార్,శివరెడ్డి గారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, అనిల్, పాఠశాల చైర్మన్, అంగన్వాడి, నర్సమ్మ,సునిత గారు,సంగయ్య స్వామి గారు, రాములు తదితరులు పాల్గొన్నారు

# మాజీ ఎంపీపీ ఆల్కరి సత్యనారాయణ
# గారిని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్

సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ నారాయణఖేడ్ నియోజకవర్గం:నారాయణఖేడ్ మండల మాజీ ఎంపీపీ ఆల్కరి సత్యనారాయణ గారు ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడి కాలి చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ గారు ఈరోజు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.
ఈ సందర్భంగా సత్యనారాయణ గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.
ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు రసీద్ గారు, మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్ గారు, నాగల్గిద్దా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్ రావు పటేల్ గారు, పరమేష్ గారు తదితరులు పాల్గొన్నారు.



## నస్తీపూర్‌లో బడిబాట నిర్వహించారు




సమస్త ప్రక్షాళనం/హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలో మండలంలోని నస్తీపూర్ గ్రామంలో మంగళవారం  బడిబాట కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమీల సాయిలు, మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రాథమిక విద్య అభ్యసించే వారికి ప్రభుత్వ బడి స్వాగతం పలుకుతుందన్నారు.
ఎలాంటి ఫీజులు వసూలు లేకుండానే పుస్తకాలు, భోజనాలు, దుస్తులు, ఉచితంగా ఇచ్చే ప్రభుత్వ బడిలోనే చేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు లోకనాథం మాట్లాడుతూ ఈసంవత్సరం ఇప్పటివరకు 10 మంది కొత్త విద్యార్థులు చేరినట్లు చెప్పారు.
గ్రామంలో ర్యాలీ తీసిన తర్వాత ఉచిత పుస్తకాల పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్, కార్యదర్శి యాదయ్య, ప్రధానోపాధ్యాయులు లోకనాథం, ఉపాధ్యాయులు నరేష్, వాలంటీర్ ప్రవళిక,ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## భారతీయ స్ఫూర్తి సేవ రత్న జాతీయ అవార్డు
## అందుకున్న అందోల్ కళ్యాణ్ కుమార్




సమస్త ప్రక్షాళనం/హత్నూర:సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామానికి చెందిన అందోల్ కళ్యాణ్ కుమార్ భారతీయ స్ఫూర్తి సేవ రత్న జాతీయ అవార్డు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ పెన్నులు పరీక్ష కేంద్రాలకు ఉచిత ఆటో సౌకర్యం క్రీడాకారులకు డ్రెస్ తో పాటు క్రీడా సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ సామాజిక కార్యక్రమాలను గుర్తించి జాతీయ స్ఫూర్తి సేవ రత్న జాతీయ అవార్డు అందజేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ అవార్డు నాకు రావడానికి కృషి చేసిన పెద్దలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


## బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న
## పాల్వంచ రాజీవ్ గాంధీ

సమస్త ప్రక్షాళనం/హత్నూర :సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కొన్యాల గ్రామానికి చెందిన




మాల మహానాడు హత్నూర మండల అధ్యక్షులు పాల్వంచ రాజీవ్ గాంధీ స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవోస్ ఫౌండర్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు హత్నూర మండలంలో ఉన్నటువంటి దళిత సామాజిక వర్గానికి చెందిన యువతను కూడగట్టి అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తానని ప్రతి యువకులు అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చు అని ఆయన అన్నారు. నేషనల్ అవార్డు తీసుకోవడానికి కృషి చేసిన పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన
## మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్



సమస్త ప్రక్షాళనం నారాయణ ఖేడ్ నారాయణఖేడ్ నియోజకవర్గం:సిర్గాపూర్ మండలం చీమల్పాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు సిర్గాపూర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ చారి గారి తండ్రి మల్లేశం గారు వయోభారంతో అనారోగ్యానికి గురవడంతో, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ గారు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా మల్లేశం గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చైర్మన్ నగేష్ శెట్కార్ గారు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కొండల్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం వైభవంగా స్వర్ణరథోత్సవం

ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (16.06.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది.

కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది.

ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది.

సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి.

ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల






మండలి సభ్యురాలు శ్రీమతి జిల్లెల శ్రీదేవి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు

## నందీశ్వరస్వామికి విశేషపూజ




లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (16.06.2026) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది.

ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది.

ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది.

వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది

# ప్రైవేటు స్కూళ్లపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి..

### నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు చేపట్టాలి...

శ్రీశైలం మండలం, సుండిపెంట గ్రామంలోని ప్రైవేట్ స్కూల్లలో అధిక ఫీజుల వసూలు చేస్తున్నారని, ఫీజులపై నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని, తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ స్కూల్ ఇస్తారాజ్యంగా మారిందని, గత ఏడాది కంటే 20 శాతం ఫీజుల పెంపు, స్టేషనరీ పేరుతో ఒక్కొక్క విద్యార్థినుంచి వేల రూపాయలు ప్రైవేట్ స్కూల్స్ వసూలు చేస్తున్నారని, అన్ని ప్రైవేట్ స్కూళ్లలో ఇదే పరిస్థితని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు పుస్తకాలు, స్కూల్ యూనిఫారమ్ అమ్మకాలు, ప్రభుత్వం ఫీజులు నిర్ణయించి, అమలు చేయాలని, వారి ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న మేనేజ్మెంట్ మీద అధికారులు ఎటువంటి శాఖ పరంగా చర్యలు తీసుకోవడం లేదని, ప్రైవేట్ స్కూళ్ల అధిక ఫీజులు పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు ,ప్రజా సంఘాలు కూడా కోరుతున్నారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్యే వివేకానంద పై చర్యలు తీసుకోవాలన్న కాంగ్రెస్ నాయకులు

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ నాయకులు

### దొడ్డిదారిన గెలిచిన వివేకానంద గౌడ్ ఎమ్మెల్యే గా కొనసాగే హక్కు లేదు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ను విచారించాలి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేసి 2023లో జరిగిన ఎన్నికలలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గెలుపొందారని ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలేటి శ్రీనివాస్ ఆరోపించారు. మీడియా సమావేశంలో ఆలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మూడుసార్లు గెలిచి నేను హ్యాట్రిక్ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్నాడని అధికారాన్ని అడ్డుపెట్టుకొని గత ఎన్నికలలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హనుమంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేసి గెలుపొందారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గెలిచిన నైతికంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలను హనుమంత్ రెడ్డి గెలిచారని తెలిపారు. సిట్ విచారణలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ చేసిన ఫోన్ ట్యాపింగ్ న చూసి విస్తృత పోయామన్నారు .ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ టాపింగ్ చేసిన నేరంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ను బర్తరఫ్ చేయాలని కోరారు. గత 12 సంవత్సరాల గా ప్రగతి నగర్కు ఎన్నో చేశానని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే ఒక పని కూడా చేయలేదని కనీసం రోడ్ల గుంతలను కూడా మరమ్మతులు చేయలేదని ప్రగతి నగర్ వైకుంఠధామం కబ్జాదారుల నుండి కాపాడి వాటి సమస్యను పరిష్కరించి అభివృద్ధి చేయాలని మేము ఎన్నోసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన కూడా కాలయాపనచేస్తూ పరిష్కరించలేకపోయాడని ఎమ్మెల్యే పదవి లేకపోయినా కొలను హనుమంత్ రెడ్డి ప్రగతి నగర్ వైకుంఠధామం సమస్య గురించి తెలుపగా వారు వెంటనే స్పందించి కబ్జాదారుల నుండి విడిపించి వైకుంఠధామం అభివృద్ధికి నిధులు తీసుకుని వచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే గత 12 సంవత్సరాల పాలనలో ఖడ్గదారులకు అండగా ఉంటూ కబ్జాలు చేసే వారిని ప్రోత్సహించారని తెలిపారు. వెంటనే అవినీతితో గెలిచిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ పై సమగ్ర విచారణ జరిపి తన ఎమ్మెల్యే పదవిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డాక్టర్ మద్ది నారాయణరెడ్డి, గూడూరు మురళి కృష్ణ, ప్రశాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సుబ్బు, సురేంద్ర యాదవ్, రఫిట్, తులసి దాస్, అరవింద నాయుడు, లోకనాథం తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘం









### భద్రాచల ముత్యాల తలంబ్రాలు పొందడం అదృష్టం

### గజ్వేల్ సి.ఐ రవికుమార్

భద్రాచల రామయ్య ముత్యాల తలబ్రాలను మంగళవారం నాడు గజ్వేల్ పోలీస్ డిపార్ట్మెంట్ బృందానికి తలంబ్రాల విశిష్టత, వాటి పవిత్రత తెలియజేసి అందజేశారు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా సి.ఐ రవికుమార్ అందరికీ ముత్యాల తలంబ్రాలను అందజేసి అనంతరం మాట్లాడుతూ సాక్షాత్తు భద్రాచలం సీతారాముల కళ్యానానికి గోటి తలంబ్రాలు అందించడం మా అదృష్టం అన్నారు. భద్రాచల రామయ్య కళ్యానానికి 300కిలోల గోటి తలంబ్రాలు అందించి, కల్యాణంతరం తిరికి 100కిలోల ముత్యాల తలంబ్రాలు తీసుకురావడంలో రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘం అన్నారు. ఈరోజు ముత్యాల తలంబ్రాలు అందుకోవడం అదృష్టం అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భక్తులందరికి తలంబ్రాలు అందించడంలో రామకోటి రామరాజు గ్రామ, గ్రామాన చేస్తున్న నిశ్వార్థ రామభక్తి అమోఘం అన్నారు. కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొన్న అందరికి తలంబ్రాలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విహారయాత్రలో విషాదం.. ముస్సోరీలో విశాఖ టెక్కీ అనుమానాస్పద మృతి

విహారయాత్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రం ముస్సోరీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. భర్తతో కలిసి వెకేషన్‌కు వెళ్లిన ఆమె, తాము బస చేసిన హోంస్టే గదిలో నిన్న ఉదయం విగతజీవిగా కనిపించడం కలకలం రేపింది.

విశాఖపట్నానికి చెందిన పి. రాధా గాయత్రి (27) ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో ఓ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. పుణేలో ఐటీ నిపుణుడిగా పనిచేస్తున్న సౌమ్య శ్రీచరణ్‌తో ఆమెకు 2025 నవంబర్ 8న వివాహమైంది. వీరు విహారయాత్ర కోసం ఢిల్లీ నుంచి బయలుదేరి, జూన్ 14న రాత్రి మసూరీ-ధనౌల్తి రోడ్డులోని కియానా హోంస్టేలో గది తీసుకున్నారు.

ఘటన జరిగిన రోజు రాత్రి తాము మద్యం సేవించామని, తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో నిద్రపోయినట్లు భర్త శ్రీచరణ్ పోలీసులకు తెలిపాడు. ఉదయం నిద్రలేచి చూసేసరికి, గాయత్రి నేలపై వివస్త్రగా, అపస్మారక స్థితిలో పడి ఉందని, ఆమె ముక్కు నుంచి రక్తం వస్తోందని వివరించాడు. మూత్రం మడుగులో ఆమె పడి ఉందని తెలిపాడు. గదిలో రక్తపు మరకలతో పాటు రెండు ఖాళీ మద్యం సీసాలను పోలీసులు గుర్తించారు.సోమవారం ఉదయం 7:23 గంటలకు సమాచారం అందుకున్న పోలీసు, అంబులెన్స్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయత్రి అప్పటికే మరణించినట్లు అక్కడి ఫార్మసిస్ట్ ధృవీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డెహ్రాడూన్‌లోని కొరొనేషన్ ఆసుపత్రికి తరలించారు.

# ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ..

# హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్

**ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కోరుతూ ఏబీవీపీ ఆందోళన**

**హైదరాబాద్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ వద్ద ఉద్రిక్తత**

**ఫీజుల నియంత్రణకు వెంటనే చట్టం తేవాలని డిమాండ్**

**ప్రభుత్వ హామీలున్నా ఫీజుల పెంపుతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు**

**నిరసనకు దిగిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు**



ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళితే, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ నేతృత్వంలో విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు.ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని ఏబీవీపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు, హామీలు ఉన్నప్పటికీ, 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని అనేక పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచేశాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు మండిపడ్డారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినప్పటికీ, ఇంతవరకు సమగ్ర చట్టం కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ జాప్యాన్ని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్ఠమైన చట్టాన్ని అమలు చేయాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




# ఆలస్యమైన రుతుపవనాలు...

# ముంబైలో నీటి వినియోగంపై కఠిన ఆంక్షలు





**ముంబైని వెంటాడుతున్న నీటి కష్టాలు...**

**10.35 శాతానికి పడిపోయిన నిల్వలు**

**పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు 20 శాతం నీటి కోత విధింపు**

**స్విమ్మింగ్ పూల్స్, నిర్మాణాలకు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేత**

**రుతుపవనాల ఆలస్యంతో రిజర్వాయర్లలో అడుగంటిన నీరు**

**ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని బృహన్ ముంబై కార్పొరేషన్ విజ్ఞప్తి**

భారత ఆర్థిక రాజధాని ముంబై తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నగరానికి నీటిని సరఫరా చేసే ఏడు ప్రధాన సరస్సులలో నీటి మట్టాలు కేవలం 10.35 శాతానికి పడిపోవడంతో బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. జూన్ 17 నుంచి నూతన ఆంక్షలు అమల్లోకి వస్తాయని అధికారులు ప్రకటించారు.

కొత్త నిబంధనల ప్రకారం, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, స్పోర్ట్స్ క్లబ్స్‌లకు రోజువారీ నీటి సరఫరాలో 20 శాతం మేర కోత విధించారు. ఇప్పటికే మే మధ్య కాలం నుంచి గృహ వినియోగదారులకు అమలవుతున్న 10 శాతం కోత యథాతథంగా కొనసాగనుంది. నగరంలోని స్విమ్మింగ్ పూల్స్‌కు నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. నిర్మాణ రంగ పనులకు కొత్తగా నీటి కనెక్షన్లు ఇవ్వబోమని, ఉన్న కనెక్షన్లను కూడా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు బీఎంసీ స్పష్టం చేసింది.

తాగునీటిని వాహనాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్ మరియు రహదారుల పరిశుభ్రతకు ఉపయోగించడాన్ని పూర్తిగా నిషేధించారు. వీటికి ప్రత్యామ్నాయంగా బోరుబావుల నీటిని వాడుకోవాలని సూచించారు. రైల్వే, రిఫైనరీల వంటి భారీ పరిశ్రమలు శుద్ధి చేసిన నీటిని మాత్రమే వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు.

రుతుపవనాల రాక ఆలస్యం కావడం, ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వెల్లడించారు. రుతుపవనాలు త్వరగా ప్రవేశించి, సరస్సులు నిండితే తప్ప ఈ గడ్డు పరిస్థితుల నుంచి ఉపశమనం లభించడం కష్టమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలందరూ నీటిని అత్యంత పొదుపుగా వాడాలని బీఎంసీ విజ్ఞప్తి చేసింది. ముంబై నీటి సరఫరా ప్రధానంగా వర్షపాతంపైనే ఆధారపడి ఉంటుంది. నగరానికి అప్పర్ వైతరణ, మోదక్ సాగర్, తన్సా, మిడిల్ వైతరణ, భట్సా, విహార్ మరియు తులసి వంటి ఏడు సరస్సుల నుంచి తాగునీరు సరఫరా అవుతోంది.

# హైదరాబాద్‌లోని ఆ రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు.. ఎక్కడో తెలుసా?

గ్లోబల్ సిటీగా పేరొందచిన హైదరాబాద్‌- అమెరికా మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా హైదరాబాద్‌లోని ఓ ప్రత్యేక రోడ్డుకు డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామాకరణం చేయాలని నిర్ణయించింది. గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా ప్లాన్ చేసిన ఈ సరికొత్త రోడ్డును ఈ నెల 23న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఇంతకూ ఆ రోడ్డు ఏదో తెలుసుకోవాలి అంటే ఈస్టోరీ చదవాల్సిందే. హైదరాబాద్‌- అమెరికా మధ్య బంధాన్ని బలోపేతం చేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సైబరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్‌కు వెళ్లే ప్రధాన రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా పేరు పెట్టాలని నిర్ణయించింది. ఈ నెల 23న సీఎం రేవంత్ రెడ్డి, భారతదేశంలోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో కలిసి ఈ రహదారిని అధికారికంగా ప్రారంభించనున్నారు. గత ఏడాది నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అంతర్జాతీయ భాగస్వామ్యాలకు గుర్తింపుగా ఈ పేరును ఖరారు చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ-అమెరికా మధ్య పెరుగుతున్న వాణిజ్య, సాంకేతిక, పెట్టుబడి సంబంధాలకు ఈ నిర్ణయం ప్రతీకగా నిలుస్తుందని భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో అమెరికాకు చెందిన పలు ప్రముఖ సంస్థలు హైదరాబాద్‌ను తమ కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకుంటున్నాయి. గత రెండేళ్లలో అనేక అమెరికన్ కంపెనీలు



నగరంలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేశాయి. దీంతో హైదరాబాద్ అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా మరింత బలపడుతోంది. ఇదే తరహాలో భవిష్యత్తులో నగరంలోని మరికొన్ని ప్రధాన రహదారులకు ప్రముఖ అంతర్జాతీయ సాంకేతిక సంస్థల పేర్లు పెట్టే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీల పేర్లను రోడ్లకు కేటాయించే ప్రతిపాదనలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

అరెరె ఇన్నాళ్లు తెలీదే.. ఫ్లైట్ మోడ్‌తో ఇన్ని బెనిఫిట్స్ ఉన్నాయా? ఇటీవల విడుదలైన 'జీసీసీ ల్యాండ్‌స్కేప్ రిపోర్ట్ 2026' ప్రకారం, 2025లో దేశంలో ఏర్పాటైన కొత్త బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లలో సగం హైదరాబాద్‌లోనే స్థాపించబడ్డాయి. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగైన మౌలిక సదుపాయాలు ఇందుకు ప్రధాన కారణాలుగా నివేదిక వెల్లడించింది.

# దేశ రాజధాని ఢిల్లీ జనాభా భారీగా పెరిగింది... సెన్సస్ తొలిదశ గణాంకాలు వెల్లడి

2011తో పోలిస్తే 15 ఏళ్లలో 37.5 శాతం వృద్ధి నమోదు ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల మంది జనాభా ఇవి ప్రాథమిక గణాంకాలేనని, తుది నివేదిక 2027లో వస్తుందని వెల్లడిదేశ రాజధాని ఢిల్లీ జనాభా అనూహ్యంగా పెరిగింది. జనగణన 2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ సర్వేలో ఢిల్లీ జనాభా 2.3 కోట్లు దాటినట్టు ప్రాథమికంగా తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.7 కోట్లుగా ఉన్న జనాభా, గత 15 ఏళ్లలో సుమారు 37.5 శాతం పెరగడం గమనార్హం. సెన్సస్ 2027లో భాగంగా చేపట్టిన 'హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' తొలి దశ ప్రక్రియ ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు ఢిల్లీలోని 45,863 బ్లాకులలో పర్యటించి దాదాపు 76 లక్షల ఇళ్లు, 55 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఈ వివరాల ఆధారంగా జనాభాను ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, ఈ గణాంకాలు తాత్కాలికమైనవేనని అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో చేపట్టనున్న రెండో దశ 'జనాభా లెక్కింపు' తర్వాతే తుది జనాభా సంఖ్యను ఖరారు చేస్తారు. రెండో దశలో ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు. జిల్లా వారీగా చూస్తే, ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల



జనాభా ఉండగా, నైరుతి ఢిల్లీలో 25 లక్షల మంది నివసిస్తున్నారు. అత్యల్పంగా న్యూఢిల్లీ జిల్లాలో కేవలం 2 లక్షల జనాభా నమోదైంది. 2026 మధ్య నాటికి ఢిల్లీ జనాభా సుమారు 2.3 కోట్లకు చేరుకుంటుందని గతంలో వచ్చిన అంచనాలకు, తాజా గణాంకాలు దగ్గరగా ఉండటం విశేషం.

# ప్రపంచంలో అత్యంత కాలుష్య దేశం ఏదో తెలుసా?



**తాజాగా విడుదలైన 'ఐక్యూఎయిర్' నివేదిక**

**ప్రపంచంలోనే అత్యంత కాలుష్య దేశంగా పాకిస్థాన్**

**పీఎం2.5 స్థాయి 67.3 మైక్రోగ్రాములు**

**డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల కంటే 13 రెట్లు అధికం**

**38.2 మైక్రోగ్రాముల పీఎం2.5తో ఆరో స్థానంలో భారత్**

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య దేశంగా పాకిస్థాన్ నిలిచింది. స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పరిశోధనా సంస్థ 'ఐక్యూఎయిర్' విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయం వెల్లడైంది. దేశంలో సగటు పీఎం2.5 స్థాయి 67.3 మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్‌గా నమోదైంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచించిన పరిమితి ఐదు మైక్రోగ్రాములతో పోలిస్తే దాదాపు 13 రెట్లు ఎక్కువ. 'ఐక్యూఎయిర్' నివేదిక ప్రకారం బంగ్లాదేశ్ (66.1), తజికిస్థాన్ (46.3), చాద్ (45.4), డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (40.8) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 38.2 మైక్రోగ్రాముల పీఎం2.5 స్థాయితో భారత్ ఆరో అత్యంత కాలుష్య దేశంగా నమోదైంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం, బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ రంగం, పంట వ్యర్థాల దహనం, గృహ అవసరాలకు బయోమాస్ ఇంధనాల వినియోగం వంటి అంశాలు కాలుష్యానికి ప్రధాన కారణాలుగా నివేదిక పేర్కొంది. ముఖ్యంగా దక్షిణాసియా దేశాలు ప్రపంచంలోనే అత్యంత అధ్వాన వాయు నాణ్యత సమస్యను ఎదుర్కొంటున్నాయని వెల్లడించింది.

అత్యంత సూక్ష్మమైన పీఎం2.5 కణాలు నేరుగా ఊపిరితిత్తులు, రక్తప్రసరణ వ్యవస్థలోకి చేరి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాము పరిశీలించిన దేశాల్లో 91 శాతం దేశాలు డబ్ల్యూహెచ్ఓ సూచించిన గాలి నాణ్యత ప్రమాణాలను చేరుకోలేకపోయాయని ఐక్యూఎయిర్ నివేదిక వెల్లడించింది.

## ఇదేందిరా సామి.. ఉత్త వాటర్ క్యాన్ రూ.75 వేలా..!



సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం శంకరయ్యకుంట గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన బాలవికాస్ వాటర్ ప్లాంట్‌లో తొలి వాటర్ క్యాన్‌కు నిర్వహించిన వేలం ఆసక్తికరంగా మారింది. ప్లాంట్ నిర్వహణ కోసం మూలనిధి సమీకరించే ఉద్దేశంతో నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన ఏర్వ శ్రీను రూ.75 వేల బిడ్ వేసి తొలి క్యాన్‌ను సొంతం చేసుకున్నారు. మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ఆయన క్యాన్‌ను అందుకున్నారు. సాధారణంగా ఒక వాటర్ క్యాన్ ధర రూ.20 నుంచి రూ.50 మధ్య ఉంటుంది. కానీ సిద్ధిపేట జిల్లాలోని ఓ గ్రామంలో మాత్రం ఒక వాటర్ క్యాన్ ఏకంగా రూ.75 వేల ధర పలికింది. ఈ వార్త ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. సిద్ధిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలం శంకరయ్యకుంట గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 200 మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చొరవతో బాలవికాస్ ఆధ్వర్యంలో కొత్తగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా బాలవికాస్ ప్రతినిధులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో వాటర్ ప్లాంట్‌కు ఏవైనా మరమ్మతులు అవసరమైతే వాటి కోసం ఒక మూలనిధి (కార్పస్ ఫండ్) ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో మొదటి వాటర్ క్యాన్‌కు వేలం నిర్వహించారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన ఏర్వ నరసింగరావు, ఏర్వ శ్రీను పోటీపడ్డారు. చివరకు ఏర్వ శ్రీను అత్యధికంగా రూ.75 వేల బిడ్ వేసి మొదటి వాటర్ క్యాన్‌ను సొంతం చేసుకున్నారు. దీంతో గ్రామస్థులు, కార్యక్రమానికి హాజరైనవారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలవికాస్ ప్రతినిధులు మాట్లాడుతూ, వాటర్ ప్లాంట్ అభివృద్ధికి అందించిన సహకారాన్ని గుర్తిస్తూ ఏర్వ శ్రీను పేరు ప్లాంట్‌పై ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా శ్రీనుకు తొలి వాటర్ క్యాన్‌ను అందజేశారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. రూ.75 వేల విలువ పలికిన ఈ వాటర్ క్యాన్ ప్రస్తుతం స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది.

## తెలంగాణ వ్యాప్తంగా ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్.. ఎన్ని సీజ్ చేశారంటే?




విద్యార్థుల భద్రతే లక్ష్యంగా తెలంగాణ రవాణా శాఖ ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. ఆర్టీఏ నిబంధనలు ఉల్లంఘించిన 245 వాహనాలను గుర్తించి, ఫిట్‌నెస్ లేని 60 స్కూల్ బస్సులను సీజ్ చేసింది. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. పిల్ల భద్రతపై తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్: విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైన తొలి రోజే తెలంగాణ రవాణా శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి స్కూల్, కాలేజీ బస్సుల భద్రతపై దృష్టి సారించింది. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తున్న 245 విద్యాసంస్థల వాహనాలను అధికారులు గుర్తించగా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న 60 స్కూల్ బస్సులను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల భద్రతే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పలు కీలక లోపాలు వెలుగుచూసినట్లు అధికారులు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (గ్రాఖజ) ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించారు. అలాగే డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే లైసెన్సులు ఉన్నాయా, వారికి తగిన డ్రైవింగ్ అనుభవం ఉందా అనే అంశాలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థుల భద్రతకు అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, అటెండెంట్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

అంతేకాకుండా బస్సుల బ్రేకులు, టైర్లు, లైట్లు వంటి యాంత్రిక భాగాల పనితీరును కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని వాహనాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, మరికొన్నింటిలో అవసరమైన పత్రాలు లేకపోవడం గుర్తించినట్లు సమాచారం. విద్యార్థుల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో ఎలాంటి రాజీ ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న వాహనాలు లేదా సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్న బస్సులను వెంటనే సీజ్ చేస్తామని రవాణా శాఖ హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులు, డ్రైవర్లు మాత్రమే కాకుండా సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది. విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యాలదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేసింది. రవాణా శాఖ గణాంకాల ప్రకారం తెలంగాణలో మొత్తం 25,987 విద్యాసంస్థల బస్సులు ఉండగా, వాటిలో 23,204 బస్సులకు మాత్రమే చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయి. మిగిలిన 2,783 బస్సులు తక్షణమే ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందాలని అధికారులు ఆదేశించారు. తమ పిల్లలను స్కూల్ బస్సుల్లో పంపే ముందు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఓవర్‌లోడింగ్ లేదా నిబంధనలు పాటించని వాహనాల గురించి అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ హెచ్చరించింది.




కేరళంలో షిగెల్లా ఇన్ఫెక్షన్ మరోసారి ఆందోళన కలిగిస్తోంది. మలప్పురం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడేళ్ల బాలుడు మృతి చెందడంతో రాష్ట్రంలో షిగెల్లా కారణంగా నమోదైన మరణాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే పలు జిల్లాల్లో నిర్ధారిత, అనుమానిత కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసింది.కేరళంలో షిగెల్లా ఇన్ఫెక్షన్ మరోసారి ఆందోళన కలిగిస్తోంది. మలప్పురం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడేళ్ల బాలుడు మృతి చెందడంతో రాష్ట్రంలో షిగెల్లా కారణంగా నమోదైన మరణాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే పలు జిల్లాల్లో నిర్ధారిత, అనుమానిత కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసింది.ఆరోగ్య శాఖ తాజా గణాంకాల ప్రకారం జూన్ 14 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 138 నిర్ధారిత షిగెల్లా కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధిక కేసులు కోజికోడ్ జిల్లాలో వెలుగుచూశాయి. అదనంగా 77 అనుమానిత కేసులు కూడా నమోదయ్యాయి. కేవలం జూన్ నెలలోనే 62 నిర్ధారిత కేసులు, 17 అనుమానిత కేసులు నమోదు కావడం వైరస్ వ్యాప్తి తీవ్రతను సూచిస్తోంది.ప్రస్తుతం కోజికోడ్, వయనాడ్, మలప్పురం, అలప్పుజ, పతనంతిట్ట, ఆరన్మూళ ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి ఆహార కేంద్రాలు, పాఠశాల భోజనశాలలు, తాగునీటి వనరులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆహార భద్రతా విభాగాన్ని మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ ఆదేశించింది.

షిగెల్లా అంటే ఏమిటి?

షిగెల్లా అనేది ఒక ప్రమాదకరమైన బ్యాక్టీరియా. ఇది "షిగెల్లోసిస్" అనే పేగు సంబంధిత ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది. చాలా తక్కువ మొత్తంలో బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించినా వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా చిన్నారులు ఈ ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశం ఎక్కువ.

షిగెల్లా లక్షణాలు ఇవే..

తీవ్రమైన విరేచనాలు
జ్వరం
కడుపు నొప్పి
వికారం, వాంతులు
తరచూ మలవిసర్జన చేయాలనిపించడం
రక్తం లేదా శ్లేష్మంతో కూడిన విరేచనాలు

లక్షణాలు సాధారణంగా బ్యాక్టీరియా సోకిన 1 నుంచి 3 రోజులలో కనిపిస్తాయి. పిల్లల్లో డీహైడ్రేషన్ త్వరగా సంభవించే అవకాశం ఉండటంతో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం.

ఎలా వ్యాపిస్తుంది?

షిగెల్లా ప్రధానంగా "మల-నోటి" (ఫీవఝిశ్రీ-ూతీఝశ్రీ) మార్గం ద్వారా వ్యాపిస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం, సరిగా చేతులు కడుక్కోకపోవడం, కలుషిత ఉపరితలాలను తాకడం ద్వారా ఈ బ్యాక్టీరియా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. పాఠశాలలు, హాస్టళ్లు, పిల్లల సంరక్షణ కేంద్రాలు వంటి రద్దీ ప్రదేశాల్లో వ్యాప్తి వేగంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలుః

టాయిలెట్ ఉపయోగించిన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలి.
మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలి.
బయట ఆహారం తీసుకునేటప్పుడు పరిశుభ్రతను గమనించాలి.
పండ్లు, కూరగాయలను బాగా కడిగి వినియోగించాలి.
పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి.

ఎప్పుడు వైద్యుడిని సంప్రదించాలి?

విరేచనాలు ఎక్కువగా ఉండటం, రక్తంతో కూడిన మలం, అధిక జ్వరం, వాంతులు, నీరసం, మూత్రం తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ ఇన్ఫెక్షన్ ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. అయితే కేరళంలో పెరుగుతున్న షిగెల్లా కేసులు పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, ఆహార భద్రత ఎంత ముఖ్యమో మరోసారి గుర్తు చేస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టడం సాధ్యమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఎలాన్ మస్క్ ఖాతాలో మరో వరల్డ్ రికార్డ్..



అంతరిక్ష రంగంలో సరికొత్త విప్లవానికి తెరతీస్తూ, టెక్నాలజీ ప్రపంచాన్ని శాసిస్తున్న వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రపంచ ఆర్థిక రికార్డులను తిరగరాస్తూ, చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని మైలురాయిని అందుకున్నారు. ఇంతకూ మస్క్ సాధించింది ఏంటో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ, అంతరిక్ష రంగాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఎలాన్ మస్క్ మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. స్పేస్‌ఎక్స్ సంస్థ చారిత్రాత్మక ఐపీఓ (ఖూూ) విజయంతో మస్క్ వ్యక్తిగత సంపద 1 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటినట్లు అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ప్రపంచ చరిత్రలో తొలి "ట్రిలియనీర్"గా నిలిచిన వ్యక్తిగా ఎలాన్ మస్క్ పేరు నమోదైంది.అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ ఇటీవల స్టాక్ మార్కెట్‌లో అడుగుపెట్టగా, పెట్టుబడిదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. కంపెనీ షేర్లు లిస్టింగ్ రోజునే భారీగా పెరగడంతో స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ 2 ట్రిలియన్ డాలర్లకు పైగా చేరింది. సంస్థలో గణనీయమైన వాటా కలిగిన ఎలాన్ మస్క్ సంపద ఒక్కసారిగా పెరిగి ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించింది. ఇది ప్రపంచ ఆర్థిక చరిత్రలో ఒక కొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

మస్క్ ఆర్థిక సామ్రాజ్యం

టెస్లా, స్పేస్‌ఎక్స్, స్టార్‌లింక్, ఎక్స్ , న్యూరాలింక్ వంటి సంస్థల ద్వారా ఇప్పటికే ప్రపంచ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న మస్క్, ఇప్పుడు మిగిలిన వారికంటే చాలా ముందంజలో నిలిచారు. ప్రస్తుతం ఆయన సంపద ప్రపంచంలోని పలువురు ప్రముఖ బిలియనీర్ల సంపద కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉందని నివేదికలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్పేస్‌ఎక్స్ విజయవంతమైన ఐపీఓ, మస్క్ ఆర్థిక సామ్రాజ్యాన్ని మరో స్థాయికి తీసుకెళ్లిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మస్క్ సంపద పెరుగుదలపై ప్రపంచవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఇది నూతన ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి ప్రతీకగా కొందరు ప్రశంసిస్తుండగా, మరోవైపు ఇంత భారీ స్థాయిలో సంపద కేంద్రీకృతం కావడంపై విమర్శలు కూడా వస్తున్నాయి. అయినప్పటికీ అంతరిక్ష రంగాన్ని సామాన్యులకు సైతం చేరువ చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న మస్క్.. చంద్రుడు, అంగారక గ్రహాలపై మానవ నివాసాల కలను సాకారం చేయడమే తన తదుపరి లక్ష్యమని స్పష్టం చేశారు.

సాధారణ యువకుడి నుండి ప్రపంచ కుబేరుడి వరకు ఒకప్పుడు దక్షిణాఫ్రికాలో సాధారణ యువకుడిగా కెరీర్ ప్రారంభించిన ఎలాన్ మస్క్.. నేడు ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించడం వ్యాపార, సాంకేతిక రంగాల్లో అత్యంత విశేషమైన ఘట్టంగా నిలిచింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ రంగంపై ఆయన ప్రభావం ఇకపై మరింత పెరగనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# జీవితం ఏం హాలత్ అయిందిరా నాయనా.. రోలర్ కోస్టర్‌పై జూమ్ కాల్!

సోషల్ మీడియాలో ప్రతిరోజూ ఎన్నో ఫన్నీ వీడియోలు వైరల్ అవుతుంటాయి. అయితే తాజాగా వైరల్ అవుతున్న ఓ వీడియో మాత్రం నెటిజన్లను కడుపుబ్బా నవ్విస్తోంది. వర్క్ ఫ్రమ్ హోమ్, రిమోట్ వర్కింగ్ సాధారణమైన ఈ రోజుల్లో ఉద్యోగులు పని, వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేసుకునేందుకు రకరకాల మార్గాలు వెతుకుతున్నారు. కానీ ఓ ఉద్యోగి చేసిన పని మాత్రం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

సోషల్ మీడియాలో ప్రతిరోజూ ఎన్నో ఫన్నీ వీడియోలు వైరల్ అవుతుంటాయి. అయితే తాజాగా వైరల్ అవుతున్న ఓ వీడియో మాత్రం నెటిజన్లను కడుపుబ్బా నవ్విస్తోంది. వర్క్ ఫ్రమ్ హోమ్, రిమోట్ వర్కింగ్ సాధారణమైన ఈ రోజుల్లో ఉద్యోగులు పని, వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేసుకునేందుకు రకరకాల మార్గాలు వెతుకుతున్నారు. కానీ ఓ ఉద్యోగి చేసిన పని మాత్రం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.




వైరల్ అవుతున్న వీడియోలో దక్షిణ కొరియాకు చెందిన ఓ ఉద్యోగి ఆన్‌లైన్ జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నాడు. అతని సహోద్యోగులు, బాస్ అందరూ తమ ఇళ్లలో నుంచే మీటింగ్‌కు హాజరయ్యారు. అయితే ఈ ఉద్యోగి మాత్రం ఓ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లోని రోలర్ కోస్టర్‌పై ప్రయాణిస్తూ మీటింగ్‌లో చేరాడు. తాను బయట ఉన్నాననే విషయం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు అతడు తన వెనుక నకిలీ వర్చువల్ బ్యాక్‌గ్రౌండ్ ఏర్పాటు చేసుకున్నాడు. మొదట్లో అతని ప్లాన్ బాగా పనిచేసింది. ప్రశాంతంగా కూర్చుని, సాధారణ ఉద్యోగిలా మీటింగ్‌లో పాల్గొన్నాడు. కానీ రోలర్ కోస్టర్ వేగం పెరిగిన కొద్దీ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

రైడ్ ఒక్కసారిగా వేగంగా దూసుకెళ్లడంతో ఉద్యోగి గాలిలో ఊగిపోవడం ప్రారంభించాడు. దీంతో అతను ఉపయోగించిన క్రోమా ఎఫెక్ట్ విఫలమై, అసలు విషయం బయటపడింది. అతను గదిలో కాకుండా రోలర్ కోస్టర్‌పై ప్రయాణిస్తున్నాడని స్క్రీన్‌పై స్పష్టంగా కనిపించింది. ఇది చూసిన సహోద్యోగులు, బాస్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే అందరూ నవ్వుల్లో మునిగిపోయారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ ఘటన జరిగినప్పటికీ మీటింగ్ మాత్రం ఆగలేదు. ఉద్యోగి కూడా ఏమీ జరగనట్లు పాల్గొనడం కొనసాగించాడు. ఇప్పటికే ఈ వీడియోకు 26 లక్షలకు పైగా వ్యూస్, లక్షకు పైగా లైకులు వచ్చాయి. "ఇదే అసలైన మల్టీటాస్కింగ్", "రోలర్ కోస్టర్‌పైనే ఆఫీస్ పని పూర్తి చేశాడు" అంటూ నెటిజన్లు సరదా కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

# హర్మూజ్‌పై కొత్త మెలిక పెట్టిన ఇరాన్.. టోల్ ఛార్జీలు లేవంటూనే..




హర్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలపై ట్రాన్సిట్ టోల్ విధించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. అయితే నావిగేషన్, పర్యావరణ పరిరక్షణ, బీమా, సముద్రయాన సేవలకు సంబంధించిన ఛార్జీలు కొనసాగుతాయని వెల్లడించింది. అమెరికాతో ఒప్పందం కుదిరినా పూర్తి స్థాయిలో విశ్వాసం లేదని ఇరాన్ పేర్కొంది.

ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై ఎలాంటి ట్రాన్సిట్ టోల్ విధించబోమని స్పష్టం చేసినప్పటికీ, సముద్రయాన సేవలకు సంబంధించిన ఛార్జీలు మాత్రం కొనసాగుతాయని తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌లో టోల్ ఉండదని ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ స్పందన ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మీడియాతో మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకల నుంచి ట్రాన్సిట్ రుసుము వసూలు చేయబోమని పునరుద్ఘాటించారు. అయితే నావిగేషన్ సేవలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, నౌకలకు బీమా సదుపాయాలు, ఇతర సముద్ర భద్రతా సేవల కోసం నిర్దిష్ట ఛార్జీలు వసూలు చేయడం కొనసాగుతుందని తెలిపారు. అమెరికాతో యుద్ధ విరమణ లేదా ఇతర ఒప్పందాలు కుదిరినా, గత అనుభవాల దృష్ట్యా వాషింగ్టన్‌పై పూర్తి స్థాయి విశ్వాసం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఇరాన్-అమెరికా సంబంధాల్లో ఇంకా అపనమ్మకం కొనసాగుతోందని సూచిస్తున్నాయి.అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం.. సహజంగా ఏర్పడిన జలసంధుల గుండా ప్రయాణించే నౌకలపై తీర దేశాలు ట్రాన్సిట్ ఫీజులు విధించలేవు. అయితే పైలటింగ్, టగ్గింగ్, పోర్టు సదుపాయాలు లేదా భద్రతా సేవలు అందించినప్పుడు పరిమిత స్థాయిలో రుసుములు వసూలు చేసే అవకాశం ఉంటుంది. ఈ ఫీజులు ఏ దేశాన్ని ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని ఉండకూడదనే నిబంధన కూడా అమల్లో ఉంది. ఇక సూయజ్ కాలువ, పనామా కాలువ వంటి మానవ నిర్మిత కాలువల విషయంలో మాత్రం ఆయా దేశాలకు టోల్ వసూలు చేసే హక్కు ఉంది. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో కొత్త రుసుములు లేదా పరిమితులు అమలైతే అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చమురు రవాణా వ్యయాలు పెరిగితే ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.

# దేశవ్యాప్తంగా దగ్గు మందు అమ్మకాలపై కేంద్రం సంచలన నిర్ణయం.. కీలక ఆదేశాలు జారీ!



దేశంలో నకిలీ, ప్రమాదకరమైన మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా చిన్న చిన్న గ్రామాల్లో కఫ్ సిరప్‌ల (దగ్గు మందు) అమ్మకాలపై ఇప్పటివరకు ఉన్న మినహాయింపులను పూర్తిగా రద్దు చేసింది. ఇకపై ఎంతటి చిన్న పల్లెటూరైనా సరే.. సరైన డ్రగ్ లైసెన్స్ లేని దుకాణాల్లో కఫ్ సిరప్‌లను విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది.దేశంలో నకిలీ, ప్రమాదకరమైన మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా చిన్న చిన్న గ్రామాల్లో కఫ్ సిరప్‌ల (దగ్గు మందు) అమ్మకాలపై ఇప్పటివరకు ఉన్న మినహాయింపులను పూర్తిగా రద్దు చేసింది. ఇకపై ఎంతటి చిన్న పల్లెటూరైనా సరే.. సరైన డ్రగ్ లైసెన్స్ లేని దుకాణాల్లో కఫ్ సిరప్‌లను విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ గ్రామీణ ప్రాంతాల్లో దగ్గు మందుల నియంత్రణ, నాణ్యతా ప్రమాణాలను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం డ్రగ్స్ రూల్స్, 1945 కింద కీలక సవరణలు చేపట్టింది. ఇందుకోసం కేంద్రం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పాత నిబంధనల ప్రకారం.. 1,000 కంటే తక్కువ జనాభా ఉన్న చిన్న చిన్న గ్రామాల్లో రిటైల్ లైసెన్స్ లేకపోయినా కొన్ని షరతులతో దగ్గు సిరప్‌లను అమ్మడానికి వీలుండేది. కానీ, తాజా సవరణతో ఆ మినహాయింపులకు కేంద్రం పూర్తిగా చెక్ పెట్టింది.

కేంద్రం తీసుకొచ్చిన ఈ కొత్త మార్పుల ప్రకారం.. చిన్న గ్రామాల్లోనైనా సరే కఫ్ సిరప్‌ల అమ్మకం, పంపిణీ ఇకపై కేవలం అధికారికంగా లైసెన్స్ పొందిన ఫార్మసీల (మెడికల్ షాపుల) ద్వారా మాత్రమే జరగాలి. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940 నిబంధనలను ఇందుకు ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. నకిలీ మందుల సరఫరాను అడ్డుకోవడంతో పాటు, కఫ్ సిరప్‌ల విక్రయాల్లో పూర్తి పారదర్శకతను తీసుకురావడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.దగ్గు మందుల బాధ్యతాయుతమైన విక్రయాలను ప్రోత్సహించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని ఆరోగ్య శాఖ తెలిపింది. ఒకవేళ ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినా లేదా విక్రయాల రికార్డుల్లో పారదర్శకత లోపించినా సంబంధిత డ్రగ్ లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తామని కేంద్రం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఉన్న కఫ్ సిరప్ తయారీదారులు, హోల్‌సేల్ పంపిణీదారులు, రిటైల్ వ్యాపారులు ఈ కొత్త లీగల్ ఫ్రేమ్‌వర్క్‌కు లోబడి పనిచేయాలని స్పష్టం చేసింది.చిన్న పల్లెల్లో సైతం నాణ్యమైన వైద్య ప్రమాణాలు అందించేందుకు, నకిలీ మందుల ముప్పు నుండి ప్రజలను కాపాడేందుకు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కాణిపాకం-వినాయకుడు

**సత్య ప్రమాణాలకు నెలవుగా.. అసత్యాలు చెప్పేవారికి సింహస్వప్నంగా చిత్తూరు జిల్లా కాణిపాకం- శ్రీ వరసిద్ధి వినాయకుని ఆలయం భాసిల్లుతోంది. కాణిపాకం వద్ద బహుదా నది ఒడ్డున ఈ ఆలయం ఉంది. సర్వమత ఆరాధ్యుడుగా కాణిపాకం వరసిద్ధి వినాయకుడు పూజలందుకుంటున్నారు. ఈ స్వామికి హిందువులే కాదు. ఇతర మతస్థులూ మొక్కులు తీర్చుకుంటారు. ముఖ్యంగా స్వామివారి దర్శనార్థం నిత్యం వందల సంఖ్యలో ముస్లింలు రావడం విశేషం. దేవుడు ఒక్కడే అన్న నిదర్శనం ఇక్కడ కనిపిస్తుంది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సైతం ఇతర మతస్థులు పాల్గొంటారు. క్షేత్రచరిత్ర/ స్థలపురాణం: సుమారు 1,000 ఏళ్ల కిత్రం ఈ ఆలయ నిర్మాణం జరిగినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. పూర్వం విహారపురి అనే గ్రామంలో ధర్మాచరణ పరాయణులైన ముగ్గురు గుడ్డి, మూగ, చెవిటి వాళ్లుగా జన్మించారు. కర్మఫలాన్ని అనుభవిస్తూ.. ఉన్న పొలాన్ని సాగు చేసుకొంటూ జీవించేవారు. ఒక దశలో ఆ గ్రామం కరవు కాటకాలతో అల్లాడింది. గ్రామస్థులకు కనీసం తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకని దుస్థితి నెలకొంది. కరవును జయించాలని సంకల్పించిన ముగ్గురు సోదరులు తమ పొలంలో ఉన్న ఏతం బావిని మరింత లోతు చేయాలనుకున్నారు. ఆ మేరకు బావిలో తవ్వుతుండగా ఓ పెద్ద బండరాయి అడ్డుపడింది. దాన్ని తొలగించే యత్నంలో పార రాయికి తగిలి రాయి నుంచి రక్తం చిమ్మింది. రక్తం అంగవైకల్య సోదరులను తాకగానే.. వాళ్ల వైకల్యం తొలగింది. జరిగిన ఈ విచిత్రాన్ని తెలుసుకున్న గ్రామస్థులు ఆ స్థలానికి వచ్చి బావిని పూర్తిగా తవ్వి పరిశీలించారు. బావిలో 'గణనాథుని' రూపం కన్పించింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో దాన్ని పూజించి స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించారు. స్వామికి గ్రామస్థులు సమర్పించిన కొబ్బరికాయల నీరు 'కాణి'భూమి( కాణి అంటే ఎకరం పొలం అని అర్థం) మేర పారింది. అప్పట్నుంచి విహారపురి గ్రామానికి 'కాణిపారకరమ్' అన్న పేరు వచ్చింది. కాలక్రమంలో అదే 'కాణిపాకం'గా మారిందని ప్రశస్తి.**

కాణిపాకం వరసిద్ధి వినాయకుడు సత్య ప్రమాణాల దేవుడిగానూ ప్రసిద్ధికెక్కారు. స్వామివారి ఎదుట ఎవరైనా తప్పుడు ప్రమాణం చేస్తే.. వారిని స్వామియే శిక్షిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వ్యసనాలకు బానిసలైన వారు (తాగుడు, దురలవాట్లు) స్వామివారి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని భక్తుల నమ్మకం. అసెంబ్లీలో సైతం రాజకీయ నేతలు 'కాణిపాకం'లో ప్రమాణం చేద్దామా? అని సవాల్ విసురుకోవడం స్వామి మహిమను చెప్పకనే చెబుతోంది..!

నిత్యం పెరిగే స్వామి: వరసిద్ధి వినాయకుడు నిత్యం పెరుగుతున్నాడు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం ఉంది. యాభై ఏళ్లనాటి వెండి కవచం ప్రస్తుతం స్వామివారికి సరిపోవడం లేదు. 2002 సంవత్సరంలో భక్తులు స్వామివారికి విరాళంగా సమర్పించిన వెండి కవచం సైతం ప్రస్తుతం స్వామివారికి ధరింపచేయడం సాధ్యం కావడం లేదు.

కాణిపాకం శివ-వైష్ణవ క్షేత్రంగా భాసిల్లుతోంది. ప్రధాన గణనాథుని ఆలయం దగ్గర్నుంచి అనుబంధ ఆలయ నిర్మాణాలకు సంబంధించి విశిష్ట పురాణ ప్రాధాన్యం ఉంది. ఒకే చోట వరసిద్ధి వినాయకస్వామి ఆలయం, మణికంఠేశ్వర, వరదరాజులు, వీరాంజనేయ స్వామి వారి ఆలయాలున్నాయి. బ్రహ్మహత్యా పాతక నివారణార్థం: స్వయంభువు వరసిద్ధి వినాయకస్వామి గుడికి వాయువ్య దిశగా ఉన్న మణికంఠేశ్వరస్వామి ఆలయం ప్రధాన ఆలయానికి అనుబంధ నిలయం. దీన్ని 11 వ శతాబ్దంలో చోళరాజు కుళొత్తుంగ మహారాజు నిర్మించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. బ్రహ్మహత్యా పాతక నివ ృత్తి కోసం శివుడి ఆజ్ఞ మేరకు ఈ ఆలయం నిర్మించారట! అద్భుత శిల్పకళ ఈ ఆలయం సొంతం. ఇక్కడ మహాగణపతి, దక్షిణామూర్తి, సూర్యుడు, షణ్ముఖుడు, దుర్గాదేవి విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయ గాలి గోపురం, ప్రాకార మండపాల్లో శిల్పకళ ఉట్టిపడే దేవతామూర్తుల ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. లోపల మరగదాంబిక అమ్మవారి గుడి ఉంది. ఇక్కడ సర్పదోష నివారణ పూజలు చేస్తారు. ఏటా అమ్మవారి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు: మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రతి గురువారం దక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేస్తారు.

**సర్పదోష పరిహారార్థం.. వరదరాజస్వామి ఆలయ నిర్మాణం**

స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి వరదరాజస్వామి ఆలయ నిర్మాణం జరిగింది. గణనాథుని ఆలయానికి ఎదురుగా ఉన్న ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి పురాణాల్లో ఓ కథ ప్రచారంలో ఉంది. జనమేజయ మహారాజు చేపట్టిన సర్పయాగ దోష పరిహారానికిగానూ శ్రీ మహావిష్ణువు ఆజ్ఞ మేరకు ఇక్కడ వరదరాజస్వామి ఆలయం నిర్మితమైనట్టు చెబుతారు. ఆలయంలోని మూలవిరాట్ ఆకారంలో సుందరశిల్ప కౌశల్యం ఉట్టిపడుతుంది. ఆలయంలో నిత్యం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తుంటారు.

**పంచామ ృతాభిషేకం టిక్కెట్ ధర: రూ. 550**



సేవాఫలితం: స్వామివారిని పంచామ ృతాలతో అభిషేకం చేయడం పుణ్యఫలం. ఈ సేవల్లో పాల్గొనడం వలన అన్ని కష్టాలు తొలగుతాయి.

**గణపతి హోమం టిక్కెట్ ధర: 500**

సేవాఫలితం: 'కలౌ చండీ వినాయకః' అంటే ఈ కలియుగమున పిలవగానే పలికే దేవతలు.. చండి(దుర్గా), గణపతి. మన దైనందిన జీవితంలో ఎన్నో విఘ్నాలు, ప్రతి పనికి పోటీ, ఏదో ఒక ఆటంకం జరగవచ్చు. అన్ని విఘ్నాలను అధిగమించాలి. అంటే గణపతిని అగ్నియుక్తంగా పూజించాలి. స్వామివారి సన్నిధిలో గణపతి హోమం చేసుకోవడం వల్ల విఘ్నాలు తొలగిపోతాయి. సకల శుభాలు కలుగుతాయి.

**గణపతి మోదకపూజ టిక్కెట్ ధర: 300**

గణపతి పురాణంలో సహస్రనామాల్లో 'మోదక ప్రియాయనమః' అని ఉంది. మోదకం అంటే కుడుములు అని అర్థం. హిందువులు ఏ శుభకార్యం చేయాలన్న ముందుగా వినాయకుడికి కుడుములు నైవేద్యంగా సమర్పిస్తారు. ఆలయంలో గణపతి మోదక పూజ చేయడం వల్ల స్వామివారి అనుగ్రహం పొందుతారు.

**సహస్ర , వ్రతపూజ టిక్కెట్ ధర: రూ. 150, రూ. 58**

సేవాఫలితం: 'కలౌ గణేశ' స్మరణాముమ్ముక్తి అన్న నానుడిని అనుసరించి స్వామివారికి 1008 నామాలు అర్పించడం వల్ల విశేషఫలం కలుగుతుంది.

**మూల మంత్రార్చన టిక్కెట్ ధర: రూ. 300**

సేవాఫలితం: వినాయకుని గణాధిపతిగా నియమించిన తర్వాత.. అక్కడ విష్ణుమూర్తి దర్శనమిచ్చారు. వినాయకుడు విష్ణువు చేతిలోని సుదర్శన చక్రాన్ని తీసుకున్నాడు. విష్ణువు అడిగినా తిరిగి ఇవ్వలేదు. దీనికి బదులుగా ఏదైనా వరం కోరుకొమ్మని విష్ణుమూర్తి అంటే త్రినేత్రములు గల శిరస్సు కావాలని గణపతి కోరతాడు. అప్పుడు విష్ణుమూర్తి బ్రహ్మదేవుని సహాయంతో నారికేళాన్ని స ృష్టించి ఇచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే గణపతిని అవాహనం చేసి నారికేళంతో పూజిస్తే మహాగణపతి సంతుష్ఠి చెందుతారు. సకల విఘ్నాలు తొలగి సుఖశాంతులు కలుగుతాయి.

**సంకటహర గణపతి వ్రతం టిక్కెట్ ధర: రూ. 151**

సేవాఫలితం: గణేశ పురాణంలో ఈ వ్రతానికి విశేష స్థానం కల్పించారు. దీన్ని శ్రీ క ృష్ణుడు, బ్రహ్మదేవుడు తదితరులు ఆచరించారు. సంతానం, వ్యాపార అభివ ృద్ధి, సకల విఘ్నాలు తొలగడం, ముఖ్యంగా కోర్టు వ్యవహారాల్లో జయం కలగడానికి దీన్ని ఆచరిస్తారు.

**పూలంగి సేవ టిక్కెట్ ధర: రూ. 1,000**

సేవాఫలితం: వివిధ రకాలైన పుష్పాలను గర్భాలయం, అంత్రాలయం, అర్ధమండపం, స్వామివారికి విశేష పుష్పాలకంరణ చేస్తారు. రంగుల పుష్పాలతో స్వామివారిని పూజించడం వల్ల లక్ష్మీ అనుగ్రహం, సౌభాగ్యం కలుగుతాయి.

**అక్షరాభ్యాసం టిక్కెట్ ధర: రూ. 116**

సేవాఫలితం: చదువుల తండ్రి వినాయకుడు. అలాంటి వినాయకుడి ఆలయం వద్ద అక్షరాభ్యాసం చేసుకుంటే పిల్లల చదువులు వ ృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో నిత్యం అక్షరాభ్యాసం జరుగుతుంటుంది.

**అన్నప్రాసన టిక్కెట్ ధర: రూ.116**

సేవాఫలితం: పిల్లలకు అన్నప్రాసనం, విశిష్ఠరోజున చేస్తారు. విఘ్నాలను తొలగించే వినాయకుని ఆలయంలో అన్నప్రాసన చేయడం శుభం. ఇక్కడ అన్నప్రాసన చేయడం వల్ల పిల్లలకు జీవితంలో మంచి జరుగుతుంది. మొదటి పూజలు అందుకునే వినాయకుడి ఆలయంలో అన్నప్రాసన చేస్తే మంచిదని పురాణాలు చెబుతున్నాయి.

**వివాహ ఆహ్వానపత్రికలకు పూజలు టిక్కెట్ ధర: రూ. 51**

సేవాఫలితం: వివాహం చేసుకునే నూతన జంటలకు సంసార జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు జరగకుండా ఉండాలని వినాయకుని చెంత పూజలు చేస్తారు.

# రాశిఫలాలు



**మేషం**

కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. ఆకస్మిక ధనలాభం ఉంటుంది. ప్రయత్నకార్యాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

**వృషభం**

శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. ప్రయాణాల వల్ల లాభం చేకూరుతుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్నివిధాలా సుఖాన్ని పొందుతారు.

**మిథునం**

దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలను పొందుతారు. కళాకారులు, మీడియా రంగాల వారికి మంచి అవకాశాలు లభిస్తాయి.

**కర్కాటకం**

ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు.

**సింహం**

స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి. నూతన గృహకార్యాలపై శ్రద్ధవహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలు అధికమవుతాయి.

**కన్య**

సమాజంలో మంచిపేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవడానికి కృషిచేస్తారు. ఆకస్మిక ధనలాభంతో రుణబాధలు తొలగిపోతాయి. స్త్రీలు, బంధు, మిత్రులను కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి.

**తుల**

ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. అనారోగ్య బాధవల్ల బలహీనులవుతారు. ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశం ఉంది. అధికార భయం ఉంటుంది. ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది.

**వృశ్చికం**

శతృబాధలు తొలగిపోతాయి. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగి ఉంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక లాభాలు ఉంటాయి.

**ధనుస్సు**

రుణలాభం పొందుతారు. స్థానచలనం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు ఎక్కువగా చేస్తారు. మెలకువగా ఉండటం అవసరం. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఉంటాయి.

**మకరం**

చెడు పనులకు దూరంగా ఉండటం మంచిది. అందరితో స్నేహంగా ఉండటానికి ప్రయత్నించాలి. కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి.

**కుంభం**

మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. తలచిన కార్యాలన్నీ విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్యబాధలుండవు.

**మీనం**

కళాత్మక వస్తువులను సేకరిస్తారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. ప్రయత్నకార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభం ఏర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. బంధు, మిత్రులను కలుస్తారు. కొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.

# మంత్రతంత్రాలతో పూజ చేస్తేనే భక్తి అంటారా?



మంత్రతంత్రాలతో పూజ చేస్తేనే భక్తి అంటారా? యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తేనే భక్తులా? ఏది భక్తి? ఎవరు భక్తుడు? భక్తి మనలో కలిగే చలనం. భక్తుడు సమాజాన్ని మార్చగలిగే సంచలనం. భగవంతుడిని చూడాలనే నిరంతర అన్వేషణే తపస్సు! అందరిలోనూ భగవంతుడిని దర్శించడమే శ్రేయస్సు!!

ఏ వేదాలు పఠించి
సాలీడు హరుడి కరుణ పొందింది.
ఏ శాస్త్రాలు చదివి భుజంగం నాగభూషణుడి
అనుగ్రహం అందుకుంది.
ఏ విద్యలు అభ్యసించిందని ఏనుగుకు
పరమేశ్వరుడి దర్శనభాగ్యం దక్కింది.

భక్తి పథంలో భగవంతుడికి తరతమ భేదాలు ఉండవని నిరూపించిన శ్రీకాళహస్తీశ్వరుడి కథ ఇది. భగవంతుడు నావాడు అనుకోవడమే అసలైన భక్తి. ఈ చరాచర సృష్టిలో అణువణువూ దైవం నిండి ఉన్నదని గ్రహించినవాడే సిసలైన భక్తుడు. తన మదిలో, ప్రతి హృదిలో దేవుణ్ని చూసిన వాడే నిఖార్సయిన సాధకుడు.భక్తి అనే పదం వింటేనే మానవుడిలో తెలియకుండానే ఒక చలనం కలుగుతుంది. తనలో భక్తి పొటమరించే కొద్దీ ఆ భక్తుడే సంచలనంగా మారుతాడు. ఈ చలనం (గమనం), సంచలనం( పురోగమనం) మానవుని మనుగడలో, మానవజాతి పురోభివృద్ధిలో అనాదిగా దిశానిర్దేశం చేస్తూనే ఉన్నాయి. అందుకే, ఇతర జంతువులకు మానవులకు ఆహారం, నిద్ర మొదలైనవి సమానమే! కాని, ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలను సాధించగలిగే, పొందగలిగే యోగ్యత మనిషికే ప్రసాదించాడు భగవంతుడు. అందులోనూ పరమ పురుషార్థంగా పేర్కొన్న మోక్షాన్ని సాధించాలంటే మన శాస్త్రాలు ప్రధానంగా మూడు మార్గాలను ఉపదేశించాయి. అవే జ్ఞానం, కర్మ, భక్తి.

**మోక్షసాధన ఎలా?**

మోక్ష సాధనలో జ్ఞానం, కర్మ మార్గాలు కొన్ని పరిమితులకు లోబడి సర్వజన సాధారణం కాలేకపోయాయి. అంటే, జ్ఞాన, కర్మ సాధన అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ, అందరికీ అనువైన మోక్ష మార్గం భక్తి. ఈ మార్గంలో చిన్నాపెద్దా వ్యత్యాసం ఉండదు. పేద-గొప్ప తేడాలు ఉండవు. అందరూ అతిసులభంగా అనుసరించగలిగే మార్గం ఇది.

అందుకే శ్రీ శంకర భగవత్పాదులు వివేకచూడామణిలో 'మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ- భక్తి మానవుడికి మోక్ష సాధనలో ముఖ్య సాధనం' అని తెలియజేశాడు. శ్రీకృష్ణ భగవానుడు 'మన్మనా భవమద్భక్తః- తనయందు అనన్యమైన భక్తి కలవాడు తనను పొందగలడు' అని భగవద్గీతలో పేర్కొన్నాడు.

**అనన్య ప్రేమ**

ఇంతకీ భక్తి అంటే ఏమిటి? ఇదే విషయాన్ని నారద మహర్షి 'భక్తి సూత్రాల్లో' ప్రస్తావిస్తూ 'సాత్వస్మిన్ పరమప్రేమరూపా' అని పేర్కొన్నాడు. అంటే, భగవంతుడిపై అనన్యమైన ప్రేమ కలిగి ఉండటమే నిజమైన భక్తి అని నిర్వచించాడు. ఇదే మార్గాన్ని అనుసరించి శ్రీకృష్ణుడి అనుగ్రహాన్ని పొందారు గోపికలు.

'చిత్తం సుఖేన భవతాపహృతం గృహేషు
యన్నిర్విశత్యుత కరావపి గృహ్యకృత్యే
పాదౌ పదం న చలతస్తవ పాదమూలాద్యామః
కథం వ్రజమథో కరవామ కిం వా'

'కృష్ణా మా మనసును హరించావు. ఇక మేము ఎటు వెళ్లేది- ఎటూ వెళ్లలేమ'ని అన్నారు. అవ్యాజమైన ప్రేమతో మురళీమోహనుడి మనసును గెలుచుకున్నారు. దీన్నే అనన్యమైన భక్తి అంటాడు నారదముని. 'అన్యాశ్రయాణాం త్యాగో అనన్యతా' అంటే గోపికల్లా అన్నీ వదిలేసి భగవంతుడిపైనే మనసును లగ్నం చేయాలని సూచించాడు మహర్షి. భాగవతం, ఇతర పురాణ ఇతిహాసాల్లో ప్రహ్లాదుడు, ధ్రువుడు వంటి భక్తులు భగవంతుడిని ఆశ్రయించి పొందిన అనుభూతులు అద్భుతాలే!

పదకొండు సాధనాలు

**'మద్భక్తివిముఖానాం హి శాస్త్రగర్తేషు ముహ్యతాం**
**న జ్ఞానం న చ మోక్షః స్యా త్తేషాం జన్మశతైరపి'**

'ఎంత గొప్ప శాస్త్ర పండితుడికైనా నాయందు భక్తి లేనట్లయితే, ఎన్ని జన్మలెత్తినా వారికి జ్ఞానం రాదు, మోక్షం లభించదు. భక్తి లేని శాస్త్రపాండిత్యం నెత్తిన బండరాయిలా భారమే తప్ప ఉపయోగం లేద'ని సాక్షాత్తూ పరమేశ్వరుడు భక్తి ఔన్నత్యాన్ని తెలియజేశాడు. ఇంతటి సర్వోత్కృష్టమైన భక్తికి నారదమహర్షి, మధుసూదనసరస్వతి మహాపురుషుల సేవతో ఆరంభించి భగవంతుడిపై పరిపూర్ణమైన ప్రేమ కోసం పదకొండు భూమికలను (సాధనాలను) ప్రతిపాదించారు. మహాత్ములను సేవించడం, సేవతో వారి అనుగ్రహాన్ని పొందడం, వారు ఆచరిస్తున్న ధర్మంపై శ్రద్ధ కలగడం, శ్రీహరి గుణాలను వినడం, శ్రీహరిపై అనురక్తి కలిగి ఉండటం, హరి స్వరూపాన్ని తెలుసుకోవడం, అలా తెలుసుకున్న పరమానంద రూపం మీద ప్రేమ ఉత్పన్నం కావడం, ఆ ప్రేమలో పరమానంద అనుభూతిని పొందడం, భగవత్ సంబంధమైన ధర్మంపై నిష్ఠ కలగడం, ధర్మనిష్ఠ ఏర్పడటంతో భగవత్ గుణాలు వ్యక్తం కావడం, ఫలితంగా భగవంతుడిపై ప్రేమ అభేద స్వరూపమై పరాకాష్ఠకు చేరడం.. ఈ పదకొండు అంచెలను దాటినవారు భగవంతుడిపై అచంచలమైన ప్రేమను పొందుతారు. భగవంతుడి సన్నిధిలేక ఉండలేని స్థితికి చేరుకుంటారు. అదే నిజమైన భక్తి. ఈ స్థితి పొందినవారు 'యత్ప్రాప్య న కించిద్వాంఛతి న శోచతి న ద్వేష్టి న రమతే నోత్సాహీ భవతి- అద్వితీయమైన బ్రహ్మానుభూ తిని కలిగి ఉంటారు' అని తెలియజేశాడు నారదుడు. భక్తి అహంకార రహితమై ఉండాలి. ఆడంబరాలకు దూరంగా ఉండాలి. ప్రచార ఆర్భాటం, పదిమంది మెప్పు కోసం ప్రదర్శించేది నిజమైన భక్తి అనిపించుకోదు.

**నవ విధ మార్గాలు**

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనం
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం**

శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవ, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదన ఈ తొమ్మిది మార్గాల ద్వారా భగవంతుడిని చేరుకోవచ్చు. వీటినే నవవిధ భక్తి మార్గాలు అంటారు. భక్తుడు తనకున్న శక్తి సామర్థ్యాలు, అవకాశాన్ని బట్టి ఈ తొమ్మిది మార్గాల్లో దేన్నయినా ఎంచుకోవచ్చు. ఏ మార్గాన్ని ఎన్నుకున్నా తుది ఫలితం దైవ సన్నిధానమే!

**తపనే భక్తి**

'రెక్కలు రాని పక్షి పిల్లలు.. తమ తల్లి కోసం, తల్లి వచ్చి ఇచ్చే పాల కోసం లేలేత లేగదూడ చూసే ఎదురు చూపే భక్తి. దేశాంతరం వెళ్లిన ప్రియుడి కోసం బాధతో ప్రియురాలు చూసే ఎదురుచూపే భక్తి. అలాగే, భగవంతుడిని చేరాలనే తపన కలిగి ఉండటమే భక్తి' అని 'భక్తి సుధా' గ్రంథంలో వివరించాడు కరపత్రిస్వామి.

**భావనే బలం**

భక్తులు అనిపించుకోవాలంటే గంటలకొద్దీ పూజలు చేయాలన్న నియమం లేదు. మనం చేసే సత్కర్మలన్నీ భగవంతుడి ప్రీత్యర్థం చేయడమూ భక్తే! గ్రామదేవతకు బోనాలు సమర్పించే క్రమంలో గ్రామీణుల్లో నిష్కల్మషమైన భక్తి ప్రపత్తులు కనిపిస్తాయి. ఆశ్వయుజ మాసంలో ఆలయాల్లో అమ్మవారికి వేదమంత్రాలతో నవరాత్రి ఉత్సవాలు జరుగుతుంటాయి. అదే సమయంలో ఆడబిడ్డలు ఆప్యాయంగా బతుకమ్మ పేర్చి, అనురాగాల రాగాలతో బతుకమ్మ పాటలు పాడుతూ అమ్మవారిని కీర్తించడంలోనూ అసామాన్యమైన భక్తి ఉంటుంది. భగవంతుడిపై మనకు కలిగే భావన బలంగా ఉండాలంటారు పెద్దలు. భక్తి భావన మనసులో బలంగా నాటుకుంటే, హృదయంలోనే దేవుడు కొలువై ఉంటాడు.



# నిన్నే గిల్లుకోలేకపోయావా?..

తర్కం లేని భక్తిని, ఆచారాలను రమణ మహర్షి తీవ్రంగా ఖండించేవారు. ఒకసారి ఒక భక్తురాలు అరుణాచలం వచ్చింది. మహర్షిని దర్శించుకుని ఆశీస్సులు అందుకుంది. స్వామితో 'భగవాన్! నేను లక్ష పత్రుల వ్రతం చేశాను' అని గర్వంగా చెప్పింది.

అప్పుడు రమణులు ఆమెతో 'అయ్యో! నీ వ్రతం కోసం చెట్టును అన్నిసార్లు గిల్లి ఆకులు కోశావా. అలాంటి వ్రతం చేయడం ఎందుకు? నిన్నే నువ్వు లక్షసార్లు గిల్లుకోలేకపోయావా!' అన్నారు. ఇలా భక్తి పేరుతో మూరంగా ప్రవర్తించేవారిని రమణులు కట్టడి చేసేవారు. భక్తిని చాటుకునేందుకు ఏ ప్రాణినీ హింసించాల్సిన అవసరం లేదని తెలియజెప్పేవారు.

# వరి పొలాల్లో ఉపయోగపడే పనిముట్లు.!












1. వరి పొలాల్లో దమ్ము చేయడం: ముందుగా రెక్కనాగలితో పొలాన్ని లోతుకు దున్ని ఎండకు ఎండబెట్టడం వలన మట్టి అడుగు భాగంలో ఉన్న చీడపీడల అవశేషాలు బయటపడి ఎండకు నశిస్తాయి. అదే కాక తుంగ వంటి కలుపు మొక్కల గడ్డలతో పాటు సమూలంగా బయటపడి నాశనమవుతాయి. ఇలా దుక్కి దున్నిన పొలంలో వరినాటు వేయడానికి ముందు నీటిని సుమారు 10 సెం.మీ. వరకు నిలిపి బాగా దమ్ము చేయాలి. దమ్ము ముఖ్య ఉద్దేశ్యము : నీటి సమ్మేళనంతో మట్టిని చిలికి తద్వారా నీటి అడుగు భాగంలో ఒండ్రుమట్టి పొరను ఏర్పరిచి, పై నిల్వ ఉంచిన నీరు లోపలి పొరల్లో ఇంకి పోకుండా చేయడం ఇందుకు ప్రత్యేకమైన నాగళ్లను మాత్రమే వాడాలి. దమ్ము చేయడానికి వాడవలసిన పరికరాలు :

**ఎ) ఎ.పి.ఏ.యు పడ్లరు :**
ఎడ్లతో సేద్యంచేసే రైతులకోసం ప్రత్యేకించి నిర్మించిన పరికరం. వరి నారుని ప్రధాన పొలంలోకి మార్చినప్పటినుండి (నాట్లు వేసినప్పటినుండి) 5-10 సెం. మీటర్ల నీటిని నిల్వ ఉంచి వరి పైరును సాగుచేయడం పరిపాటి. కాకపోతే ఈ నీటి నిల్వను తగ్గకుండా కాపాడేందుకు మరియు నాట్ల సమయంలో మొక్క వేళ్ళు ఇమడడానికి మెత్తటి భూమిని పొందుపరిచేందుకు "వరిదమ్ము" చాలా అవసరం అనగా ఇలా దమ్ము చేయు గలిగిన దానికై ప్రత్యేకంగా రూపొందించిన ఎ.పి.ఎ.యు. వడ్లరును వాడి అనుకున్న విధంగా వరిదమ్మును చేయగలదు. ఈ విధంగా ఎ.పి.ఎ.యు పడ్లరుతో దమ్ము చేయడం వలన నేల అడుగు భాగంలో ఒక గట్టి మట్టి పొర ఏర్పడి నీటిని లోపలి పొరలలోకి పోకుండా చేసి తద్వారా ప్రధాన పొలంలో పెట్టే సాగునీటి మొత్తాన్ని సుమారు 30-40 శాతం ఆదా చేయవచ్చు. ఎ.పి.ఎ.యు పడ్లరు ఖరీదు రూ.2,800/-,

**బి. విష్ణు పడ్లరు :**
దీనిని ట్రాక్టరుకు తగిలించుకొని వరి పొలంలో దమ్ము చేయడానికి ప్రత్యేకంగా "ఆంధ్రప్రదేశ్ నీటి యాజమాన్య పథకము", తిరుపతి వారు రూపొందించారు. ఈ యంత్రాన్ని నీటిని నిల్వ ఉంచిన పొలంలో దమ్మును సమర్థవంతంగా చేయవచ్చును. ఈ యంత్రంలో 36 లేదా 40 కర్రులు కలిగి ముందుకు లాగడం వలన మధ్యలో అమర్చబడిన షాఫ్ట్ తిరిగి, దానితో పాటు అమర్చిన పలకలు లేదా తెడ్డును త్రిప్పుతుంది. ఇలా త్రిప్పేప్పుడు మట్టి ముద్దలను పైకి క్రిందకు కలియత్రిప్పి చిలకడం వలన దమ్ము నాణ్యత పెంపొందిస్తుంది, ఇలా దమ్ము చేసిన పొలాన్ని పలక సహాయంతో చదును చేసి 12-24 గంటలు కదపకుండా ఉంచి ఆపై పొలంలో నాట్లను వేసుకోవాలి. ఇలా చేయడంవలన వరి నాట్లకు కావలసిన మెత్తటి పొర ఏర్పడుతుంది. అంతేకాక వరి సాగులో సాగునీటి ఆదా 40 శాతం వరకు మరియు దమ్ముచేసే సమయము 50 శాతం వరకు తగ్గించవచ్చునని పరిశోధనాపూర్వకంగా నిరూపించబడిరది. దీని ఖరీదు రూ.18,000/- నుంచి 22,000/- వరకు ఉంటుంది.

**సి. రోటోవేటర్:**
రోటోవేటరు మెట్ట సేద్యంలోనే కాక వారిదమ్ము చేయడానికి సమర్థవంతంగా వాడవచ్చును. ఇది ముందు వివరించిన విధంగా ట్రాక్టరు/పవర్ టిల్లర్ యొక్క పి.టి.ఓ. షాఫ్ట్ ద్వారా నడుపబడే యంత్రము దీనికి అమర్చబడిన ఒంపు కర్రల పి.టి.ఒ ద్వారా అందిన శక్తితో వేగంగా తిరిగి తిప్పి మట్టిగడ్డలను నూర్చి నీటిలో చిలకరిస్తుంది. ఇలా చేయడం వలన వరినాట్లుకు కావలసిన దమ్ము నాణ్యత పెరిగి నీటిని వేలలోపలికి ఇంకి పోకుండా పూర్తిగా అరికడుతుంది. అంతేకాక ఈ రోటోవేటర్ను వాడే పక్షంలో దుక్కిని నాగలితో దున్నే అవసరం కూడా ఉండదు. కాకపోతే నీటిని నిల్వ ఉంచిన పొలంలో రోటోవేటర్ సహాయంతో ట్రాక్టర్/పవర్ టిల్లర్ మొదటి గేరులో అంటే అతి తక్కువ వేగంలో దమ్ము మొదలు పెట్టాలి. ఆ తరువాత వేగం పెంచి దమ్ము నాణ్యతను పెంచవచ్చు. ఇలా చేయడం మూలంగా మామూలు వద్దతితో పోలిస్తే 60 శాతము సమయాన్ని, 40 శాతము సాగునీటిని తగ్గించి, నాణ్యమైన దమ్మును పొందవచ్చును. దీని ఖరీదు రూ? 1,00,000 వరకు ఉంటుంది.

**డి. పళ్ళెపు దంతి:**
ఈ పళ్ళెపు దంతిని మెట్ట సేద్యంలోనే కాక, వరిపొలాల్లో దమ్ము చేయడానికి కూడా సమర్థవంతంగా వాడవచ్చును. కాకపోతే, ఈ పళ్ళెపు దంతులలో సింగిల్ యాక్షన్ డిస్క్ హారో (ఒకే వరుసలో అమర్చబడిన పళ్ళాల దంతి) ని మాత్రమే దమ్మును చేయడానికి వాడవలెను. ఇలా అడుసు పొలంలో దమ్ము చేసిన తరువాత చదును చేసే పలకను వాడి నేల ఉపరితలాన్ని చదును చేయడం వరి పంట నీటి యాజమాన్యంలో చాలా ముఖ్యమైన పని. ఈ పరికరం ద్వారా సాగు నీటిని 20% వరకు ఆదా చేయవచ్చునని నిరూపించబడినది. పళ్ళెపు దంతి ఖరీదు రూ.30,000/-,

**2. పచ్చిరొట్టె ఎరువును కలిపే ట్రాంప్లర్ :**
రైతాంగం వరి పొలంలో నేల స్వభావాన్ని బట్టి పోషకాలు మరియు మట్టి భౌతిక పరిమాణాలను మెరుగు పరిచేందుకు జనుము లేదా జీలుగలను (లేదా) రైతుకు అందుబాటులో ఉన్న ఇతర పచ్చిరొట్టె ఎరువును కలుపడం పరిపాటి. ఈ పచ్చిరొట్టి ఎరువుకై పండిరచే నేలలో కలిపేందుకు దున్ని పొలంలో నీటిని నిల్వ ఉంచి ఈ ట్రాంప్లర్ను వాడాలి. దీనిలో ఎడ్ల సహాయంతో నడిపేవి మరియు ట్రాక్టరు సహాయంతో నడిపేవి విడి విడిగా రూపొందించబడిరది. ఈ ట్రాంప్లర్కు అమర్చిన పొడవాటి కత్తులు (బ్లేడ్స్), పరికరాన్ని లాగినపుడు నేలపై పరచబడిన పచ్చి ఆకును కత్తిరించి మట్టిలోపలకు త్రొక్కుతూ మట్టిని కొంతవరకు తిరగ తిప్పుతుంది. ఇలా ట్రాంప్టర్ను వాడి పచ్చిరొట్టె ఎరువును తొందరగా మట్టిలోకి కలపడమేకాక సమర్థవంతంగా కుళ్ళిందుకు గం దీని ఆకార నిర్మాణాలను చూసి పొరపాటుతో పరి దమ్ముకు చేసే యంత్రంగా వాడడం ఏ మాత్రం ఉపయోగకరం కాదు..

**3. ఎ. వరి డ్రమ్ సీడరు :**
దీని ద్వారా " ఒకే సారి ఎనిమిది వరుసలలో సాళ్ళమధ్య 20 లేదా 25 సెం.మీటర్ల దూరంలో విత్తేందుకు వీలవుతుంది. మనము నాటాలనుకున్న వరి విత్తినాన్ని 24 గంటలు నానబెట్టి 12 గం? మండె కట్టి, గింజల నుండి మొలక ఆరంభదశలో పరికరానికి అమర్చిన నాలుగు డబ్బాలలో నింపాలి. ఇలా డబ్బాలను 3/4 వరకు నింపి, పరికరాన్ని ముందుగా దమ్ముచేసి చదును చేసిన పొలంలో చక్రాల సహాయంతో పరికరానికి అమర్చిన, చేతిపిడి సహాయంతో లాగడం వలన చక్రాలు తిరిగి డబ్బాలు తిరిగి, డబ్బాలకున్న రంధ్రాల ద్వారా పొలంలో వరుసగా పడుతుంది. ఈ వరుసలు పొడవకుండా పొలంలో వారం వరకు పలుచటి నీరు మాత్రమే పెట్టాలి. డ్రమ్ సీడరును లాగడానికి ఒకరు, ఒకరు విత్తనం అందించడానికి అవసరము కావడం వలన వరి నాటే ఖర్చు బాగా తగ్గి సుమారు రూ.1500/- నుండి రూ.2000/- వరకు ఆదా చేయవచ్చునని పరిశోధనల ద్వారా నిరూపించబడిరది. ఈ డ్రమ్ సీడరును ఉపయోగించి రోజుకు 2-3 ఎకరాల వరి నాటవచ్చును.

**బి. వరి నాటే యంత్రాలు :**
ఈ పద్ధతిలో ప్లాస్టిక్ ట్రేలు సుమారు 600 గ్రా?ల మట్టిని నింపి ఆపై విత్తనాన్ని పరచి ఆపై మట్టి మరియు ఎక్కువ పశువుల ఎరువు లేదా వర్మికంపోస్టు వేయడం ఆపై నీరు చిలకరించడం వరకు ఒకే కన్వేయర్ యంత్రం ద్వారా నిర్వర్తించవచ్చును. ఇలాంటి 80 ట్రేలు ఒక ఎకరా పొలానికి కావల్సివుంటుంది. ఈ ట్రేలను పొలంలో ఒక మూలన పలుచటి నీటిని కట్టి దాంట్లో వుంచి 15 నుంచి 25 రోజులు పెంచి నారును యంత్రం ద్వారా సమర్థవంతంగా నాటవచ్చును. నారు నాటేందుకు ముందు పొలాన్ని బాగా దమ్ము చేసి, చదును చేసుకోవడం చాలా ముఖ్యం అంతేకాక పొలాన్ని ఆరబెట్టాలి. నాటే ముందు పలుచగా నీరు పెట్టడం వల్ల వరి నారు నాటే యంత్రం సులువుగా నడిపేందుకు ఈ యంత్రం ద్వారా నాటినపుడు 8 సాళ్ళలో ఒకే మారు నాటడం జరుగుతుంది. ఈ యంత్రం ద్వారా రోజుకు 2-6 ఎకరములు వరినాట్లను వేయవచ్చును. వ్యవసాయ కూలీలు ఖర్చు సుమారు 45 శాతం తగ్గుతుంది. దీని ఖరీదు రూ. 2,75,000/- నుండి రూ. 18,00,000/- వరకు ఉంటుంది.

# తాటి పండు ఆవశ్యకత మరియు విలువ ఆధారిత ఆహార పదార్ధాలు.!



గ్రామీణ భారతంలో తాటి చెట్టు అత్యంత ప్రాధాన్యత గలది. తాటి చెట్టు భాగాలలో పనికి రానిది ఏదీ లేదు. మన దేశంలో తీరప్రాంత రాష్ట్రాల్కెన గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, గోవా, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా మరియు బెంగాల్లో తాటి చెట్లు అధికంగా ఉన్నాయి. ఇవి భారతదేశంలో సుమారు 15 కోట్లు ఉన్నట్లు అంచనా. అందులో అధికంగా తమిళనాడులో ఆ తరువాత ఆంధ్ర ప్రదేశ్లో ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్లో సుమారు 3 కోట్లు తాటి చెట్లు ఉన్నాయని అంచనా. చక్కెర నిచ్చు చెట్లలో తాటి, ఖర్జురా, కొబ్బరి మరియు జీరిక ముఖ్యమైనవి. వీటిలో తాటిలో ఎక్కువ చక్కెర ఉంటుంది. ఈ చెట్లు సహజ సిద్దముగా పెరిగి విరివిగా లభించును. అందువల్ల చాలా ప్రాముఖ్యత కలదు.తాటిలోని అన్ని భాగాలు ఉపయోగకరమైనవి. దాదాపు 800 పైగా ఉపయోగాలు ఉన్నాయని అంచనా. ఇందులో ముఖ్యమైనవి ఎనీరా, ముంజెలు, పండ్లు, తేగలు మరియు బుర్రముంజె తినేవాటిలో ముఖ్యమైనవి. వీటితోపాటు వివిధ భాగాలనుండి అనేక రకాల్కెన పీచు లభించును. వీటిలో ఆడచెట్ల నుండి మాత్రమి లభించు పండ్లు ఆగష్టు నుండి అక్టోబరు వరకు చాలా విరివిగా లభించును.తాటి పండ్లు బాగా పక్వానికి వచ్చిన తరువాత వటికవే రాలుతాయి. సరాసరి ఒకచెట్టు నుండి 250 పండ్లు లభించును. తాటి పండులో 1 నుండి 3 టెంకలు ఉంటాయి. 74 % పండ్లలో మూడు టెంకలు ఉంటాయి. రెండు టెంకలు గల పండ్లు 18% ఉంటాయి. మిగిలిన 8% ఒక టెంకను కలిగి ఉంటా యి. తాటి పండులో గుజ్జు 11 శాతం, పీచు 13.5 శాతం మరియు టెంకలు 67.5 శాతంతో పాటు పైతొక్క 8 శాతముంటుంది. ఒక్కొక్క పండులో సుమారు 300 గ్రా. గుజ్జు లభించును. తద్వారా ఒక చెట్టు నుండి 75 కిలో గుజ్జు లభించును. ఆంధ్రప్రదేశ్లో గల 1.5 కోట్ల ఆడ చెట్ల నుండి ఒక కోటి మెట్రిక్ టన్నుల గుజ్జు లభ్యత కలదు. ప్రస్తుతం ఒక శాతం గుజ్జు కూడా వినియోగంలో లేదు, చాలా తక్కువ పరిమాణంలో ఇళ్ళలో తాటి ఇడ్లి, రొట్టె చేసుకొంటారు. ఈ గుజ్జును ఉపయోగించి పరిశ్రమ పెట్టుటకు చాలా అవకాశలు కలవు.

**తాటి గుజ్జు లోని పోషక విలువలు :** తాటి గుజ్జు దాదాపు 78 % తేమ మరియు 15 % చక్కెరలు కలిగి ఉంటుంది. మాంసకృత్తులు 3 %, పీచు పదార్ధము 1.7 % తో పాటు ఖనిజ లవణాలు 4.4 % మరియు 100 గ్రా.లలో 3.2 మి.గ్రా. బీటా కెరోటిన్ను కలిగి ఉండును. వీటితో పాటు "సి" విటమిన్ మరియు అనేక పోషక విలువలు సమృద్ధిగా ఉండును. మామిడి పండ్ల కంటే అధికంగా పోషక విలువలు కలిగి ఉంటుంది.సాధారణంగా తాటి గుజ్జు లభించే సమయంలో సేకరించి చాపల మీద సన్నని పొరలగ వేసి ఎండలో ఆరబెట్టి తాండ్ర తయారు చేస్తారు మరియు ఈ తాటి పండ్ల గుజ్జును నేరుగా గాని, విరి పిండి గోధుమ పిండిలో కలిపి వివిధ రకాల ఆహార పదార్ధాలు తయారు చేయవచ్చు.

తాటి పండును వేడి నీటిలో పది నిమిషాలు ఉంచడం ద్వారా సులభంగా గుజ్జును వేరు చేయవచ్చు మరియు సహజంగా తాటిలో గల కొంచెం చేదును తొలగించవచ్చును, చేదును ఆవిరిలో ఉడికించండం ద్వారా కుడా చేదును పుర్తిగా తొలగించవచ్చును.

**తాటి గుజ్జు నుండి ఆహార పదార్ధాలు :**

**శీతల పానీయం :**
తాటి గుజ్జుకు తగినంత పరిమాణంలో చక్కెర కలిపి 0.5% నిమ్మ ఉప్పును 0.1% సోడియం బెంజోయేట్ మరియు కావలసిన రంగును కలిపి తాజా పానీయమును చేసుకోవచ్చు. దీన్ని తగిన విధంగా నిల్వ ఉంచినచో రెండు నెలల వరకు నిల్వ ఉంచవచ్చు. తాటి గుజ్జును ఇతర పండ్ల గుజ్జుతో కలిపి వివిధ రకాల్కెన పానీయాలు తయారు చేయవచ్చు. ఇందులో పైనాపిల్, ద్రాక్ష, బత్తాయి వాడవచ్చు. తాటి గుజ్జులో మూడో వంతు ఇతర పండ్ల గుజ్జును తీసుకోవాలి.


**స్క్వాష్ :** తాటి గుజ్జుకు చిక్కబడిన చక్కెర ద్రావణాన్ని కలపడం ద్వారా స్క్వాష్ తయారు చేయవచ్చు. సుమారు 200 గ్రా. గుజ్జుకు 300 గ్రా. చక్కెర మరియు చిటికెడు నిమ్మ ఉప్పు మరియు సోడియం బెంజోయేట్ ఒక లీటరు నీరు అవసరం. దీన్ని పరిశుభ్రమైన సీసాల్లో కొంచెం ఖాళీ ఉంచి నింపడం ద్వారా నిల్వ ఉంచవచ్చును.

**జాము :**ఒక కె. జి. తాటి గుజ్జును అరగంట సేపు వేడిచేసి అర కిలో చక్కెర కలపి 2 గ్రా. నిమ్మ ఉప్పును కలిపి చిక్కబడే వరకు మరగించడం ద్వారా జాము తయారు చేయవచ్చును. ఇందులో మొత్తం చెక్కర శాతము 68 బ్రిక్స్ ఉండును.

**తాటి తాండ్ర లేదా ఫ్రూట్ బార్ :** తాటి గుజ్జుకు తగినంత పరిమాణంలో చక్కెర కాని తాటి చక్కెర కాని కలిపి 0.5% నిమ్మ ఉప్పును 0.1% సోడియం బెంజోయేట్ కలిపి ఎండలో గాని వేడి గాలి యంత్రాలలో గాని, ఎండబెట్టడం ద్వారా తయారు చేయవచ్చు.

**చిక్కబడిన గుజ్జు :**
తాటి గుజ్జును 0.1% సోడియం బెంజోయేట్ కలిపి అరగంట సేపు వేడిచేసి పరిశుభ్రమైన సీసాలలో నింపడం ద్వారా నిల్వ ఉంచవచ్చును.తాటి గుజ్జును ఫోమింగ్ ఎజెంట్తో కలిపి ఎండబెట్టడం ద్వారా పిండి రూపంలోకి మార్చవచ్చును. దీన్ని ఉపయోగించి చాక్లెట్స్, బిస్కెట్స్ మరియు ఇతర అనేక రకాల్కెన ఆహార పదార్థాలు తయారు చేయవచ్చును.

# లక్షల్లో లాభాలు పొందాలనుకుంటున్నారా?
# అయితే ఇప్పుడే డెయిరీ ఫార్మ్ మొదలు పెట్టండి.!



్యవసాయ అనుబంధ రంగమైన పాడిపెంపకం.. రైతులకు భారీ ఆదాయం తెచ్చిపెడుతోంది. అయితే నిర్వహణపై అంతగా అవగాహన లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా పశు వులకు అందించే దాణా విషయంలో వైఫల్యం పొందుతున్నారు. దీంతో పాటు మేలు జాతి పశువులు కాకుండా.. తక్కువ పాల దిగుబడినిచ్చే పశువులను ఎంపిక చేస్తున్నారు. కాబట్టి, డెయిరీ నిర్వహణలో ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలైన ఆదాయం పొందవచ్చు.మేతలో జాగ్రత్తలు: పశువుకు అందించే మేతపైనే పాల దిగుబడి ఆధారపడి ఉంటుంది. కాబట్టి, పప్పు ధాన్యాలతో పాటు పచ్చి, ఎండు గడ్డిని అందించే ప్రయత్నం చేయండి. ప్రతీ 2-2.5 లీటర్ల పాలకు రెండు కిలోల చొప్పున మేత అందించండి. అధిక ఖర్చయినా.. వీలైనంత వరకు మినరల్ మిక్చర్ పెట్టండి. జంతువులు ఇచ్చే పాల సామర్థ్యం ఆధారంగా మేత పెట్టాలి. ముఖ్యంగా గేదెలు, ఆవులకు ఇచ్చే మేతలో 60-65% పీచు పదార్థాలు, 30-40 దాణా ఉండేలా చూడాలి. పాలు పితకడానికి కనీసం రెండు గంటల ముందు నీరు, మేత ఇవ్వడం మేలు.

**పాలు పితకడంలో జాగ్రత్తలు**
పాలు పితికేటప్పుడు షెడ్ ను శుభ్రంగా ఉంచుకోవాలి.

పితకడానికి ముందు గేదె/ఆవు పొదుగు, చనులను గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి. గేదెకు చాఫ్ కట్టర్ తో కత్తిరించిన గడ్డిని మాత్రమే అందించాలి. పాలు పితికే వ్యక్తి చేతులకు ఎక్కువగా గోళ్లు ఉండకుండా. చూడాలి. శానిటైజర్ తో చేతులను శుభ్రం చేసుకోవాలి.

పాలు పితికే సమయంలో పొగ తాగడం, మద్యం సేవించి పిండొద్దు. తల వెంట్రుకలు చిన్నవిగా ఉండాలి.

పాలు పితికే పాత్రలు శుభ్రంగా ఉంచాలి. అపరిశుభ్రమైన పాత్రలు ఉపయోగిస్తే పాలు త్వరగా చెడిపోతాయి.

పాలు పిండే మొదటి ధారల్లో సూక్ష్మ క్రిములుంటాయి. కాబట్టి, వేరే పాత్ర లేదా నేలపై పిండాలి.

పాలు పిండిన తర్వాత చనులను అయోడిన్ ద్రావణంలో ముంచాలి. పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే పాల ఉష్ణోగ్రత తగ్గించాలి.

యంత్రంతో పాలు పితకడం: డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్న రైతులు, వ్యాపారస్తులు పాలు పితకడం కోసం యంత్రాలను ఉపయోగించడం ఉత్తమం. ఎందుకంటే అధిక పాల ఉత్పత్తి ఉన్న పశువుల్లో చేతి ద్వారా ఎక్కువ సేపు పాలు పితకాలంటే కష్టమవుతుంది. సాధారణంగా ఒక పశువులో పాలు పితకడం కేవలం 5-6 నిమిషాల్లోనే పూర్తి చేయాలి. ఇలా పితక్కపోతే కొన్ని పాలు పొదుగులోనే ఉండి, పొదుగు వాపు వ్యాధులకు దారితీస్తుంది. ఫలితంగా పాల ఉత్పత్తి తగ్గి రైతు నష్టపోతాడు. కానీ యంత్రం ఉపయోగించి పాలు పితికితే.. పాలను శు భ్రంగా తీయడంతో పాటు, వ్యాధులను దూరం చేయవచ్చు. దీంతోపాటు చనుల్లో పాలు పూర్తైన తర్వాత చనులకు తగిలించిన కప్పులు వాటికవే ఊడిపోతాయి. కాబట్టి, ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అయితే ఈ యంత్రాలన్నీ పశువులను ఎక్కువ పాలు ఇచ్చేలా ప్రేరేపిస్తాయి. కాబట్టి, అధిక పాల ఉత్పత్తి అవుతుంది.

దూడలతో ఆదాయం: డెయిరీ ఫామ్ తో లాభాలు ఎలా వస్తాయంటే దూడల ద్వారా అని ఇట్టే చెప్పేస్తారు. అవునండీ, పాలతో మాత్రమే లాభాలు వస్తాయనుకుంటే మీరు పొరబడినట్లే. ముఖ్యంగా నిర్వహణ కోసం మీరు తెచ్చుకునే గేదె ఆవు 10-15 రోజుల్లో ఈనే విధంగా ఉండాలి. అలాంటప్పుడే మీరు దూడ, పాలు.. రెండింటితో లాభాలు గడించవచ్చు. దూడను పెంచి, చూడి కట్టిన తర్వాత విక్రయిస్తే మీరు రెట్టింపు ధర పొందవచ్చు. అయితే మీరు విక్రయించే దూడ కూడా మంచి బ్రీడ్ అయి ఉండాలి. ఎక్కువ పాలు, అధిక వెన్న శాతం కలిగి ఉండాలి. సాధారణ దూడలు అయితే మాత్రం ఆశించిన ధర లభించకపోవచ్చు. ముఖ్యంగా మీ డెయిరీ ఫాంలోనే స్వయంగా కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నట్లైతే మీరు నాణ్యమైన బ్రీడ్ ఎంపిక చేసుకోండి. ఈ విధంగా మీరు డెయిరీ ఫామ్ లాభాలు పొందవచ్చు.

# బ్రహ్మ ముహూర్తం అంటే ఏమిటి..? ఆ టైంలో నిద్ర లేస్తే ఎన్ని ప్రయోజనాలో తెలుసా?




బ్రహ్మ ముహూర్తంలో, అనగా సూర్యోదయానికి 88 నిమిషాల ముందు నిద్రలేవడం శ్రేష్ఠమని వేదాలు చెబుతున్నాయి. ఇది అరుణోదయ దర్శనానికి, సూర్యనారాయణ మూర్తిని పరబ్రహ్మ స్వరూపంగా దర్శించడానికీ మార్గం. ఈ పవిత్ర సమయంలో మేల్కోవడం ద్వారా ఆధ్యాత్మిక ప్రయోజనాలను పొందవచ్చని చాగంటి కోటేశ్వర రావు వివరించారు. సూర్యోదయం కాకముందే నిద్రలేవడం వల్ల కలిగే అపారమైన ఆధ్యాత్మిక ప్రయోజనాలను ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావు వివరించారు. వేదాలు నిర్దేశించిన విధంగా, మనిషి తన రోజును ప్రారంభించాల్సిన విధానం "బ్రహ్మ ముహూర్త ఉత్తిష్ఠేత్" అనే సూత్రం ద్వారా స్పష్టమవుతుంది. అంటే, బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి ఉండాలి. బ్రహ్మ ముహూర్తం లేదా ప్రాతఃకాలం అంటే ఏమిటనే సందేహం సహజంగా కలుగుతుంది. సూర్యోదయ సమయాన్ని పంచాంగం ద్వారా ఋషులు నిర్ధారిస్తారు. ఈ పంచాంగం తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలను వివరిస్తూ, ఋతువుల ఆధారంగా సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలను తెలియజేస్తుంది.

బ్రహ్మ ముహూర్తం లేదా ప్రాతఃకాలం అంటే..?

పంచాంగంలో పేర్కొన్న సూర్యోదయ సమయానికి సరిగ్గా 88 నిమిషాల ముందు నిద్రలేవాలి. ఈ కాలాన్నే "ప్రాతఃకాలం" అని అంటారు. ఈ ప్రాతఃకాలంలో నిద్రలేవనివారు "అరుణ దర్శనం"ను కోల్పోతారని శాస్త్రం చెబుతుంది.

బ్రహ్మ, విష్ణు, శివుల అంశ సంభూతుడిగా..

అరుణ దర్శనం అంటే సూర్య భగవానుని రథసారథి అయిన అరుణుడిని దర్శించడం. సూర్యనారాయణ మూర్తి తేజోమయంగా ఆవిష్కరించబడటానికి ముందు, ఆయన సారథి అయిన అరుణుడు ఎర్రటి కాంతితో దర్శనమిస్తాడు. ఆ ఎర్రటి కాంతి బింబం కనిపించినప్పుడు, మన తండ్రి సూర్యుడు వస్తున్నాడని భావించి దర్శనం చేయాలి. కొద్ది క్షణాల్లోనే ఆ ఎర్రదనం బంగారు కాంతిగా మారి, సూర్య భగవానుడు జ్యోతిస్వరూపుడై దర్శనమిస్తాడు. "నమః పూర్వాయ గిరయే పశ్చిమే గిరయే నమః జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః" వంటి ఆదిత్య హృదయ శ్లోకాల ద్వారా సూర్యుని బ్రహ్మ, విష్ణు, శివుల అంశ సంభూతుడిగా, అపారమైన కాంతి పుంజంగా కీర్తిస్తారు.

బ్రహ్మ, విష్ణు, శివుల తేజస్సు..

సూర్య భగవానుని వర్ణిస్తూ తిక్కన చెప్పిన పద్యాలు ఈ దర్శన ప్రాముఖ్యతను మరింత నొక్కి చెబుతాయి. సూర్యుడు నీరజాకరములు (తామరలు) చేసిన భవ్యతపస్సుకు ఫలమైనట్టు, చక్రవాక పక్షుల జంటల అనురాగాన్ని నిలబెట్టడానికి వచ్చినట్టు, బ్రహ్మ, విష్ణు, శివుల తేజస్సు కలగలిసిన కాంతి పిండమైనట్టు వర్ణించబడింది. రాత్రంతా విడిపోయి విలపించే చక్రవాక పక్షులకు అరుణోదయం కాగానే ఒకరినొకరు చూసుకుని సంతోషిస్తాయి. అలాగే, నిద్రించే తామరలు సూర్యోదయం కాగానే వికసిస్తాయి. సూర్యుడు సకల జగాలకు కనులు తెరిపించేవాడు, హృదయ పద్మాలు వికసింపజేసి, చేతులు నమస్కారం చేసేలా చేసేవాడు. కళ్ళతో చూడగలిగే ఏకైక పరబ్రహ్మ స్వరూపమైన సూర్యుని ప్రాతఃకాలంలో దర్శించకపోవడం కృతఘ్నతకు చిహ్నం. "కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః" అనే మంత్రం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. కాబట్టి, సూర్యోదయానికి 88 నిమిషాల ముందు మేల్కొని, అరుణోదయ దర్శనం చేసి, సూర్య భగవానుని తేజోమయ రూపాన్ని దర్శించడం ద్వారా ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిని పొందాలని చాగంటి కోటేశ్వర రావు బోధించారు.

# స్మార్ట్‌ఫోన్‌కు బానిసయ్యారని బాధపడుతున్నారా? చిన్న క్యూబ్‌తో స్క్రీన్ టైమ్‌కు బ్రేక్ వేసేయచ్చు

నేటి కాలంలో ఈవెంట్ ఏదైనా, ప్రదేశం ఏదైనా.. ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ ఫోన్లలో మునిగిపోయి కనిపిస్తున్నారు. ఇల్లు, బాత్‌రూమ్, బెడ్‌రూమ్, చివరికి నడుస్తున్న రోడ్డు మీద కూడా ఫోన్ చూడటం ఒక వ్యసనంగా మారింది. చూస్తూ చూస్తూనే ప్రజలు ఈ డిజిటల్ ప్రపంచానికి బానిస అయిపోతున్నారు. స్మార్ట్‌ఫోన్‌కు బానిసయ్యారని బాధపడుతున్నారా? చిన్న స్మార్ట్ ఫోన్ వాడకాన్ని తగ్గించుకోవాలని అందరికీ ఉంటుంది కానీ, ఒక చిన్న నోటిఫికేషన్ రాగానే చెయ్యి ఆటోమేటిక్‌గా ఫోన్ వైపు వెళ్ళిపోతుంది. ఈ డిజిటల్ వ్యసనం నుంచి బయటపడటానికి ఇప్పుడు మార్కెట్లోకి ఒక వింత పరికరం వచ్చింది. అదే 'బ్రిక్'. ముఖ్యంగా 20 నుండి 35 ఏళ్ల యువతలో ఈ చిన్న పరికం ఇప్పుడు సెన్సేషన్ సృష్టిస్తోంది.ఆధునిక కాలంలో స్మార్ట్ ఫోన్ లేనిదే క్షణం గడవదు. ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ప్రతి పనికి ఫోన్ మీద ఆధారపడుతున్నాం. ఇది క్రమంగా మనల్ని సామాజికంగా ఒంటరిని చేస్తోంది. ఈ డిజిటల్ బానిసత్వం నుండి బయటపడాలని ఎంతోమంది ప్రయత్నిస్తుంటారు కానీ, ఇన్ స్టాగ్రామ్ రీల్స్ లేదా వాట్సాప్ మెసేజ్‌లు వారిని అస్సలు వదలవు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక చిన్న గ్రే కలర్ క్యూబ్ ఇప్పుడు రక్షకుడిగా మారింది. ఎయిర్‌పాడ్స్ కేస్ పరిమాణంలో




ఉండే ఈ చిన్న పరికరం మీ జీవితాన్ని ఎలా మారుస్తుందో తెలుసుకుందాం..

బ్రిక్ అనేది ఒక చిన్న ఫిజికల్ డివైస్. ఇది మీ స్మార్ట్ ఫోన్‌తో కనెక్ట్ అయి ఉంటుంది. దీని ధర సుమారు రూ. 5,000. ఇది చూడ్డానికి చాలా సింపుల్‌గా ఉన్నా, పనితీరులో మాత్రం చాలా పవర్‌ఫుల్. ఈ పరికరం మీ ఫోన్ స్క్రీన్ టైమ్‌ను రోజుకు సగటున 3 గంటల వరకు తగ్గిస్తుందని తయారీ కంపెనీ ధీమాగా చెబుతోంది.

కేవలం ఒక చిన్న ట్యాప్ తో మీ ఫోన్ లోని అనవసరమైన యాప్స్ అన్నింటినీ ఇది బ్లాక్ చేస్తుంది. ఈ పరికరాన్ని మీ ఇంట్లో ఒక ప్రదేశంలో పెట్టుకోవాలి. మీరు పని మీద దృష్టి పెట్టాలని అనుకున్నప్పుడు లేదా ఫోన్ వాడకూడదని నిర్ణయించుకున్నప్పుడు, మీ ఫోన్ ను ఈ 'బ్రిక్' కు టచ్ చేయాలి.

మీరు ఒకసారి ఫోన్ ను బ్రిక్ కు టచ్ చేయగానే, మీ ఫోన్ లోని సోషల్ మీడియా యాప్స్, గేమ్స్ వంటివి అన్నీ లాక్ అయిపోతాయి.


మీరు తిరిగి ఆ యాప్స్ వాడాలంటే మళ్ళీ వచ్చి ఆ ఫిజికల్ బ్రిక్ ను ఫోన్ కు టచ్ చేయాల్సిందే. అంటే మీరు ఫోన్ కు దూరంగా ఎక్కడో ఒకచోట ఈ బ్రిక్ ను పెడితే, మీరు లేచి వెళ్లి దాన్ని టచ్ చేసే వరకు మీ ఫోన్ లోని వ్యసనకారక యాప్స్ ఓపెన్ కావు.

కాల్స్, మెసేజ్‌లు వంటి ముఖ్యమైన ఫీచర్లు మాత్రం అందుబాటులో ఉంటాయి. కేవలం మనల్ని బానిసలుగా మార్చే యాప్స్ ను మాత్రమే ఇది అడ్డుకుంటుంది. ప్రస్తుత యువతలో 'డిజిటల్ డెటాక్స్' పట్ల ఆసక్తి పెరిగింది. ఫోన్ సెట్టింగ్స్ లో ఉండే 'స్క్రీన్ టైమ్' లిమిట్స్ ను మనం సులభంగా బైపాస్ చేయవచ్చు కానీ, ఫిజికల్ గా ఒక పరికరం ద్వారా లాక్ చేయడం వల్ల మానసికంగా ఒక క్రమశిక్షణ వస్తుందని వినియోగదారులు భావిస్తున్నారు. అందుకే 20-35 ఏళ్ల మధ్య ఉన్న వారు దీనిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. టెక్నాలజీ వల్ల వచ్చిన సమస్యకు టెక్నాలజీ తోనే పరిష్కారం వెతకడం వింతగా అనిపించినా, బ్రిక్ వంటి పరికరాలు మనల్ని వాస్తవ ప్రపంచంలోకి తీసుకురావడానికి సహాయపడుతున్నాయి.

# గంటల తరబడి కూర్చుంటున్నారా? ఆ అలవాటు మిమ్మల్ని క్యాన్సర్ వైపు నడిపిస్తుందని తెలుసా

ఆఫీసులో గంటల తరబడి డెస్క్ ముందే కూర్చుని పని చేయడం, ఇంటికి రాగానే సోఫాలో వాలిపోయి ఫోన్ స్క్రోల్ చేయడం, టీవీ చూడటం, కబుర్లు చెప్పడం.. ఇవి మన దైనందిన జీవితంలో సర్వసాధారణం అయిపోయాయి. ఈ అలవాటు చాలా మామూలుగా అనిపించవచ్చు.గంటల తరబడి కూర్చుంటున్నారా? ఆ అలవాటు మిమ్మల్ని క్యాన్సర్ వైపు నడిపిస్తుందని తెలుసా

కానీ, మనకు తెలియకుండానే ఇది శరీరాన్ని లోపల నుంచి నిశ్శబ్దంగా దెబ్బతీస్తోంది. కదలిక లేని ఈ నిశ్చల జీవనశైలి వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు పొంచి ఉందని ముంబై, పుణెకు చెందిన ప్రముఖ క్యాన్సర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు మన జీవితాన్ని సులభతరం చేశాయి కానీ, అదే సమయంలో మన ఆరోగ్యాన్ని అదృశ్య ముప్పులోకి నెట్టేస్తున్నాయి. గత కొన్నేళ్లుగా క్యాన్సర్ చికిత్సలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చినా, మన అలవాట్లు మారకపోవడం పెద్ద శాపంగా మారింది. కేవలం పొగ తాగడం, మద్యం సేవించడం వల్ల మాత్రమే క్యాన్సర్ వస్తుందని అనుకుంటే పొరపాటే. మీరు రోజులో ఎక్కువ సమయం



కదలకుండా ఒకే చోట కూర్చుంటున్నారా? అయితే ఆ అదృశ్య శత్రువు మీ శరీరంలో తిష్టవేసే అవకాశం ఉంది. దీనివల్ల కలిగే అనర్థాల గురించి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

అదృశ్య ముప్పు..

నేటి కాలంలో మన వృత్తిపరమైన, వ్యక్తిగత పనులన్నీ స్క్రీన్‌ల ముందే సాగుతున్నాయి. నడక తగ్గడం, ప్రతి చిన్న పనికి వాహనాలపై ఆధారపడటం వల్ల రొమ్ము, పేగు, గర్భాశయ క్యాన్సర్ల ముప్పు పెరుగుతోందని శాస్త్రీయ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఒక గంట వ్యాయామం చేయడం వల్ల రోజంతా కూర్చున్నప్పుడు జరిగే నష్టాన్ని పూర్తిగా భర్తీ చేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో కదలిక లేనప్పుడు హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. ఇన్సులిన్ నిరోధకత పెరగడం వల్ల కణాలు అసాధారణంగా వృద్ధి చెందుతాయి. కండరాలు కదిలినప్పుడు విడుదలయ్యే 'మయోకైన్స్' అనే రక్షణ కవచాలు కదలిక లేకపోవడం వల్ల తగ్గిపోతాయి. దీనివల్ల శరీరం దీర్ఘకాలిక వాపుకు గురై క్యాన్సర్ కారకంగా మారుతుంది.

క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవడానికి జిమ్‌లో గంటల తరబడి కష్టపడాల్సిన అవసరం లేదు. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు.ప్రతి అర గంటకు ఒకసారి కనీసం రెండు నిమిషాలు నిలబడటం లేదా నడవడం అలవాటు చేసుకోవాలి.

ఫోన్ మాట్లాడుతున్నప్పుడు ఒకే చోట కూర్చోకుండా అటు ఇటు నడవండి.తిన్న వెంటనే కూర్చోకుండా కనీసం 10 నిమిషాల పాటు చిన్న నడక సాగించండి.లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఎక్కడం ద్వారా కండరాలను చురుగ్గా ఉంచవచ్చు.వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామంతో పాటు, రోజంతా కదలకుండా ఉండకుండా జాగ్రత్త పడటం ఎంతో అవసరం. మీ శరీరంలో కదలిక ఎంత ఎక్కువగా ఉంటే, క్యాన్సర్ ముప్పు అంత తక్కువగా ఉంటుంది. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది.

# బరువు తగ్గాలని అల్పాహారం మానేసున్నారా? అయితే మీరు రోగాలను కొనితెచ్చుకుంటున్నట్టే



బరువు తగ్గాలనే లక్ష్యంతో ఉన్నవారికి ప్రస్తుతం వినిపిస్తున్న ఏకైక మంత్రం 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్' . సోషల్ మీడియాలో సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ దీని గురించి చర్చించుకుంటున్నారు. అయితే, కేవలం గంటల లెక్కన ఉపవాసం ఉంటే సరిపోతుందని చాలామంది భావిస్తుంటారు.ఇందులో మనం చేస్తున్న ఒక చిన్న పొరపాటు మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా బ్రేక్‌ఫాస్ట్ మానేసి రాత్రి ఆలస్యంగా తినే అలవాటు ఉంటే జాగ్రత్త పడాల్సిందే అంటున్నారు నిపుణులు. నేటి కాలంలో ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెరిగింది. బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో భాగంగానే నిర్ణీత సమయం మాత్రమే ఆహారం తీసుకుంటూ, మిగిలిన గంటలన్నీ ఉపవాసం ఉండే పద్ధతి ప్రాచుర్యం పొందింది. సాధారణంగా 16 గంటల ఉపవాసం, 8 గంటల భోజన సమయం పాటిస్తుంటారు. అయితే, ఈ క్రమంలో ఏ సమయంలో తింటున్నామనేది అత్యంత కీలకం. ఈ విషయంలో ప్రజలు చేస్తున్న పొరపాట్లు ఏంటో తెలుసుకుందాం..

మన శరీరానికి ఒక అంతర్గత గడియారం ఉంటుంది. పగలు పని చేయడానికి, రాత్రి విశ్రాంతి తీసుకోవడానికి మన అవయవాలు అలవాటు పడి ఉంటాయి. పగటిపూట ఇన్సులిన్ పనితీరు చాలా చురుగ్గా ఉంటుంది. రాత్రి అయ్యేకొద్దీ అది తగ్గుతుంది. శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకునే సమయంలో మనం ఆహారం తీసుకుంటే, అది జీర్ణం కావడం కష్టమవుతుంది అంటున్నారు నిపుణులు. అంటే, మనం పగలు తినే ఆహారం శక్తిగా మారుతుంది, కానీ రాత్రి ఆలస్యంగా తినే ఆహారం కొవ్వుగా పేరుకుపోతుంది.

చాలామంది ఉదయం అల్పాహారం మానేసి, రాత్రిపూట భారీ భోజనం చేస్తున్నారు. ఇది మన శరీర జీవక్రియలకు వ్యతిరేకంగా పోరాడటమే అంటున్నారు నిపుణులు. ఉదయం 8 లేదా 10 గంటలకే ఆహారం తీసుకోవడం ప్రారంభించే 'ఎర్లీ టైమ్ రిస్ట్రిక్టెడ్ ఈటింగ్' పద్ధతి అత్యంత ప్రభావవంతమైనదని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. చీకటి పడగానే మన మెదడులో 'మెలటోనిన్' అనే హార్మోన్ విడుదలవుతుంది.ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించమని ప్యాంక్రియాస్‌కు సూచిస్తుంది. ఒకవేళ మీరు రాత్రి 9 గంటలకు భోజనం చేస్తే, ఇన్సులిన్ సరిగ్గా ఉత్పత్తి కాక రక్తంలో చక్కెర స్థాయిలు అలాగే ఉండిపోతాయి. దీనివల్ల భవిష్యత్తులో డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. బరువు తగ్గాలనుకునే వారు బ్రేక్‌ఫాస్ట్ మానేయడం కంటే రాత్రి భోజనాన్ని మానేయడం లేదా చాలా త్వరగా ముగించడం వల్ల అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని సూచిస్తున్నారు నిపుణులు. సాయంత్రం 4 లేదా 6 గంటలకే భోజనం ముగించడం వల్ల, నిద్రపోయే సమయంలో శరీరం కణాల శుద్ధీకరణ ప్రక్రియను చేపడుతుంది. ఇది కొవ్వును కరిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

గోల్డెన్ రూల్..

"ఉదయం రాజులా, మధ్యాహ్నం యువరాజులా, రాత్రిపూట పేదవాడిలా తినాలి" అనే సూత్రాన్ని పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. గడియారాన్ని చూడటం ఆపి, సూర్యుడి గమనాన్ని అనుసరించి ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోండి. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది కేవలం ఎన్ని గంటలు ఆకలితో ఉన్నామనేది కాదు, ఎప్పుడు తింటున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరూ సరైన సమయంలో ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోండి!

# పిల్లలు మొండికేస్తున్నారా? చైనాలో వైరల్ అవుతున్న 'రివర్స్ పేరెంటింగ్'

సాధారణంగా ఏ ఇంట్లో చూసినా పిల్లలు అల్లరి చేస్తుంటే తల్లిదండ్రులు వారిని గద్దిస్తుంటారు. "అలా చేయకూడదు.. ఇలా ఉండాలి" అంటూ లెక్చర్లు ఇస్తుంటారు. క్రమశిక్షణ పేరుతో పిల్లలపై ఆంక్షలు విధిస్తుంటారు. కానీ, చైనాలోని యువ తల్లిదండ్రులు ఇప్పుడు దీనికి పూర్తి భిన్నమైన బాట పట్టారు.

పాతకాలపు పద్ధతులను పక్కన పెట్టి, పిల్లల మనస్తత్వానికి అనుగుణంగా ప్రవర్తించే 'రివర్స్ పేరెంటింగ్' అనే సరికొత్త ట్రెండ్‌ను అనుసరిస్తున్నారు. చైనాలోని చాలా ఇళ్లలో ఇప్పుడు దృశ్యం మారిపోయింది. పిల్లలు నేల మీద పడి ఏడుస్తుంటే, తల్లిదండ్రులు వారిని కొట్టడం లేదు సరికదా.. తాము కూడా వారి పక్కనే పడుకుని ఏడుస్తున్నట్లు నటిస్తున్నారు. వినడానికి వింతగా ఉన్నా, దీనినే 'రివర్స్ పేరెంటింగ్' అంటున్నారు. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదిక ప్రకారం, యువ తల్లిదండ్రులు తమ పిల్లలతో వ్యవహరించే తీరులో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. అధికారాన్ని చలాయించడం కంటే, బాధ్యతను నేర్పడమే ఈ పద్ధతి ముఖ్య ఉద్దేశం.

రివర్స్ పేరెంటింగ్ అంటే ఏంటి?

ఇందులో మూడు ముఖ్యమైన పద్ధతులు ఉన్నాయి.

1. రోల్ రివర్సల్

తల్లిదండ్రులు ఎప్పుడూ తామే సర్వశక్తిమంతులుగా ఉండకుండా, కొన్నిసార్లు తమ బలహీనతలను పిల్లల ముందు ప్రదర్శిస్తారు. ఉదాహరణకు, తల నొప్పోంది అని చెబితే.. ఆ చిన్నారి తన తల్లికి నీళ్లు ఇవ్వడం లేదా ఓదార్చడం వంటివి చేస్తుంది. దీనివల్ల పిల్లల్లో సానుభూతి, బాధ్యత పెరుగుతాయి.

2. పర్యవసానాల ద్వారా నేర్చుకోవడం

పిల్లలు మాట వినకుండా చలిలో సన్నటి బట్టలు వేసుకుంటామని మొండికేస్తే, వారిని వారించకుండా అలాగే వెళ్లనివ్వాలి. ఆ చలి తగిలినప్పుడు కలిగే ఇబ్బందిని వారు స్వయంగా అనుభవిస్తే, మరుసటి రోజు నుంచి వారే జాగ్రత్తగా ఉంటారు. పది మాటల కంటే ఒక అనుభవం ఎక్కువ నేర్పుతుందని ఈ పద్ధతి చెబుతోంది.

3. ప్రతిబింబ చర్య

పిల్లలు చాక్లెట్ కోసం మారాం చేస్తూ నేలపై పొర్లాడితే, పేరెంట్స్ కూడా వారి పక్కనే పడుకుని అచ్చం అలాగే ప్రవర్తించాలి. తమ ప్రవర్తనను ఇతరులు అనుకరించడం చూసి పిల్లలు ఆశ్చర్యపోతారు. తమ చర్యలు ఎంత అసహ్యంగా ఉన్నాయో వారికి అర్థమై, వెంటనే ఏడుపు ఆపేస్తారు.నేటి యువ తల్లిదండ్రులు తమ చిన్నతనంలో చాలా కఠినమైన క్రమశిక్షణలో పెరిగారు. అప్పట్లో కేవలం మాట వినడం మాత్రమే ముఖ్యం ఉండేది. కానీ, ఇప్పుడు వారు తమ పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడాలని, పరస్పర గౌరవం ఉండాలని కోరుకుంటున్నారు. అందుకే అరుపులు, కేకలు లేకుండా పిల్లలకు వాస్తవ ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారు. రివర్స్ పేరెంటింగ్ అనేది అన్ని వేళలా పనిచేసే మంత్రదండం కాదు.దీనిని వాడేటప్పుడు చాలా ఓపిక ఉండాలి. పిల్లలను గేలి చేస్తున్నట్లు కాకుండా, వారికి అవగాహన కల్పిస్తున్నట్లుగా ఉండాలి. టీనేజ్ పిల్లల కంటే చిన్న పిల్లల మీద ఈ పద్ధతి బాగా పనిచేస్తుంది. పెద్ద పిల్లలతో అయితే చర్చలు, లాజిక్ ద్వారానే ఫలితాలు వస్తాయి. అధికారం భయం ద్వారా కాకుండా, అవగాహన ద్వారా రావాలని రివర్స్ పేరెంటింగ్ చెబుతోంది. పిల్లలు మన మాట వినాలంటే, ముందు మనం వారి ప్రపంచంలోకి వెళ్లాలి. ఈ సరికొత్త ట్రెండ్ మన దేశంలో కూడా మెల్లగా మొదలవుతోంది.

# బంగారం ధరలు

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | ₹13,85,000 | ₹15,08,100 |
| ముంబయి | ₹13,81,000 | ₹15,06,600 |
| న్యూఢిల్లీ | ₹13,82,500 | ₹15,08,100 |



# వ్యాపారం

## పూర్తిగా మారిన పాన్ కార్డు రూల్స్..

# ఈ తప్పులు చేస్తే జైలుకు వెళ్లాల్సిందే..




దేశంలో నివసించే వారికి పాన్ కార్డు అనేది ఎంత అవసరమనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒక గుర్తింపు ధృవీకరణ పత్రంగా కాకుండా బ్యాంక్ అకౌంట్ తెరవడం దగ్గర నుంచి ఇన్ కమ్ ట్యాక్ ఫైలింగ్, రిటర్న్ వరకు ప్రతీ పనికి ఉపయోగపడుతుంది.

దేశంలో నివసించే ప్రతీఒక్కరికి ఆధార్ కార్డుతో పాటు పాన్ కార్డ్ చాలా అవసరం. ఈ రెండు గుర్తింపు ధృవీకరణ పత్రాలు చాలా ముఖ్యమైనవి. ప్రభుత్వ పథకాలు, ప్రైవేట్ సేవలు పొందటంలో ఇవి చాలా ఉపయోగపడతాయి. బ్యాంకు ఖాతా తెరవడం నుండి ఆర్థిక లావాదేవీలు చేయడం వరకు పాన్ కార్డు అనేది అవసరం. పాన్ కార్డు లేకపోపతే ఎలాంటి పెద్ద ఆర్థిక లావాదేవీలు చేయలేరు. కానీ పాన్ కార్డ్‌కు సంబంధించిన నియమ, నిబంధనల గురించి చాలామందికి పెద్దగా తెలియదు. మీరు కొన్ని పొరపాట్లు చేస్తే జైలుకు వెళ్లే అవకాశముంటుంది. అలాగే భారీగా జరిమానా కూడా చెల్లించాల్సి రావొచ్చు.

భారత్‌లో చట్ట ప్రకారం ఒక వ్యక్తి పేరు మీద ఒక పాన్ కార్డు మాత్రమే ఉండాలి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 272బి ప్రకారం ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులు ఉండకూడదు. ఒకవేళ కలిగి ఉంటే రూ. 10 వేల జరిమానా విధిస్తారు.పన్ను ఎగవేత లేదా ఏ విధమైన మోసం కోసమైనా ఉద్దేశపూర్వకంగా రెండు వేర్వేరు పాన్ కార్డులను ఉపయోగిస్తే జైలు శిక్ష పడవచ్చు. సాంకేతిక లోపాల వల్ల లేదా మొదటిసారి పాన్ కార్డు పోగొట్టుకున్న తర్వాత తప్పుడు పద్ధతిలో మళ్లీ దరఖాస్తు చేసుకోవడం వల్ల రెండు పాన్ కార్డులు పొందుతారు. మీకు కూడా ఇలా జరిగి ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అదనపు పాన్ కార్డును వెంటనే ఆదాయపు పన్ను శాఖకు సమర్పించండి. ఇలాంటప్పుడు ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు లేదా జరిమానాలు ఉండవు. ఆన్ లైన్ ద్వారా మీరు డీయాక్టివేట్ చేసుకోవచ్చు. అలాగే సమీపంలోని పాన్ కార్డు జారీ చేసే కార్యాలయానికి వెళ్లి కూడా డీయాక్టివేట్ చేసుకోవచ్చు. మీ దగ్గర రెండు పాన్ కార్డులు ఉంటే వెంటనే ఈ పని చేయండి.ఆదాయపు పన్ను శాఖ ఎప్పటికప్పుడు పాన్ కార్డ్ నియమాలు, నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉంటుంది. పలు లావాదేవీలకు పాన్ కార్డు తప్పనిసరి చేసింది. దీంతో ఎప్పటికప్పుడు వీటి గురించి అవగాహన కలిగి ఉండాలి. లేకపోతే మీరు భారీగా నష్టపోవాల్సి ఉంటుది.

## ఆర్బీఐ గుడ్ న్యూస్.. ఒక్క గ్రాముకు రూ.14 వేలు..

# గోల్డ్‌లో ఇన్వెస్ట్ చేసినవారికి పండుగే..




ఆర్బీఐ జారీ చేసిన సావరిన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడి పెట్టినవారికి శుభవార్త. ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. 2020-21 సావరిన్ గోల్డ్ బాండ్ సిరీస్ - ఀఀఀకి ప్రీ మెచ్యూర్ డేట్ ప్రకటించింది. జూన్ 16వ తేదీ నుంచి విత్ డ్రా చేసుకోవచ్చని తెలిపింది.

=బంగారంలో పెట్టుబడి పెట్టేవారికి పండుగే. గోల్డ్‌పై ఇన్వెస్ట్ చేసినవారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అద్భుత అవకాశం కల్పిస్తోంది. సావరిన్ గోల్డ్ బాండ్ సిరీస్-ఀఀ ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ డేట్, ప్రైస్ తాజాగా ప్రకటించింది. 2020-21 సావరిన్ గోల్డ్ బాండ్ సిరీస్ ఉ ఀఀఀకి ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ధర వెల్లడించింది. 2019 జూన్ 16వ తేదీన ఈ బాండ్లను ఆర్బీఐ జారీ చేసింది. 2026 జూన్ 16 నుంచి ముందుగా రిడెంప్షన్ చేసుకునే మంచి అవకాశం ఆర్బీఐ కల్పిస్తోంది. 2019లో బాండ్ ఇష్యూ చేసినప్పుడు గ్రాము ధర రూ.4677గా ఉండగా.. ఇప్పుడు ముందుగా విత్ డ్రా చేసుకునేవారికి గ్రాముకు రూ.14,774గా నిర్ణయించింది. జూన్ 11,12,15వ తేదీల్లో సగటు ధర ఆధారంగా ఫిక్స్ చేసింది.రూ.లక్ష పెట్టుబడికి రూ.3 లక్షలు

ఈ బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేవారికి గ్రాములపై రూ.10,147 లాభం లభించనుంది. అంటే 219.30 శాతం లాభం దక్కనుంది. దీని ప్రకారం చూస్తే ఏడేళ్ల క్రితం రూ.లక్ష పెట్టుబడి పెట్టినవారికి 219 శాతం రిటర్న్ రానున్నాయి. అంటే ఇప్పుడు రూ.3,19,300 అందనున్నాయి. లక్ష పెట్టుబడి పెడితే రూ.3 లక్షలు ఇప్పుడు రానుంది. ఈ బాండ్లపై ఆర్బీఐ 2.50 శాతం వార్షిక వడ్డీ అందిస్తుండగా.. ప్రతీ లక్షపై ఒక ఏడాదికి రూ.2500 వడ్డీ లభించనుంది. ఏడేళ్లల్లో రూ.17,500 వడ్డీ అందుతుంది. లక్ష పెట్టుబడిపై రూ.3,36,800 ఇప్పుడు అందనుంది. ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేసేవారికి ఇది జాక్ పాట్‌గా చెప్పవచ్చు. అయితే గోల్డ్ బాండ్ కాలపరిమితి 8 ఏళ్లు ఉంటుంది. కానీ ఐదేళ్ల తర్వాత ముందుగానే అడ్వాన్స్‌డా విత్ డ్రా చేసుకునే అవకాశం ఆర్బీఐ కల్పిస్తోంది. 2019లో బంగారం రేటుతో పోలిస్తే ఇప్పుడు బంగారం ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసినవారికి భారీగా లాభాలు దక్కనున్నాయి.

కాగా గతంలో ఆర్బీఐ గోల్డ్ బాండ్లను ఎక్కువగా జారీ చేస్తూ ఉండేది. వారానికి ఒక బాండ్ విడుదల చేసింది. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో ఒకసారి జారీ చేసేది. ప్రస్తుతం బంగారం ధరలు భారీగా పెరుగుతున్న క్రమంలో గోల్డ్ బాండ్లను జారీ చేయడం పూర్తిగా నిలిపివేసింది. అయితే ఆర్బీఐ గోల్డ్ బాండ్లను తిరిగి ప్రవేశపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

# క్రీడలు

## చదువు, సంస్కారం లేదు.. పక్కా పల్లెటూరోడు..

## వైభవ్ పై నోరు పారేసుకున్న లంక మేనేజర్



చదువు, సంస్కారం లేదు.. పక్కా పల్లెటూరోడు.. వైభవ్ పై నోరు పారేసుకున్న లంక మేనేజర్

ఋఀఎఀఋఙ ాశీశీతీఋఋఀఀఙ : ఇండియా-ఏ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ శ్రీలంక-ఏ మ్యాచ్ అనంతరం వివాదంలో చిక్కుకున్నాడు. మైదానంలో తోపులాట తర్వాత శ్రీలంక మాజీ మేనేజర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. వైభవ్ సూర్యవంశీ ప్రత్యర్థిని నెట్టేయడంపై, లంక మాజీ మేనేజర్ పల్లెటూరి కుర్రాడు అంటూ వ్యాఖ్యానించాడు.

క్రికెట్ మైదానంలో ఆటగాళ్ల మధ్య గొడవలు, స్లెడ్జింగ్ సహజమే అయినప్పటికీ ఒక్కోసారి అవి హద్దులు దాటి పెద్ద వివాదాలకు దారితీస్తుంటాయి. ప్రస్తుతం శ్రీలంక వేదికగా జరుగుతున్న ట్రై సిరీస్‌లో భారత యువ ఓపెనర్, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆట కంటే ఎక్కువగా తన ప్రవర్తనతో నెగటివ్ వార్తల్లో నిలిచాడు. ఇండియా-ఎ తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రత్యర్థి జట్టు ఆటగాడితో గొడవకు దిగడం ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శ్రీలంక-ఎ జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఇండియా-ఎ టీమ్ సూపర్ ఓవర్‌లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ విజయానంతరం శ్రీలంక ఆటగాళ్లు ఆనందంతో జోష్ లో ఉంటూ భారత ఆటగాళ్లను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో తీవ్ర నిరాశలో ఉన్న వైభవ్ సూర్యవంశీ సహనం కోల్పోయి, లంక ఆటగాడి దగ్గరకు వెళ్లి అతడిని గట్టిగా పక్కకు తోసేశాడు. దీనికి ప్రతిగా సదరు లంక ఆటగాడు కూడా వైభవ్‌ను వెనక్కి నెట్టడంతో మైదానంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. వెంటనే మిగిలిన ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకుని ఇరువరిని విడదీశారు. ఐసీసీ నిబంధనల ప్రకారం మైదానంలో ప్రత్యర్థి ప్లేయర్లను భౌతికంగా నెట్టడం తీవ్రమైన నేరం కాబట్టి, వైభవ్‌పై నిషేధం పడే అవకాశం ఉంది.ఈ ఘటనపై శ్రీలంక క్రికెట్ జట్టు మాజీ మేనేజర్ బ్రయాన్ థామస్ సోషల్ మీడియా వేదికగా అత్యంత దారుణమైన, వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ ప్రవర్తనను తప్పుబడుతూ.. “నేను ఇప్పుడే సూర్యవంశీ అహంకారాన్ని వీడియోలో చూశాను. క్రికెట్‌లో రెడ్ లేదా ఎల్లో కార్డ్ లేకపోవడం విచారకరం. మ్యాచ్ రెఫరీ ఈ కౌబాయ్ (గొర్రెల కాపరి)ని తదుపరి మ్యాచ్ ల నుంచి సస్పెండ్ చేస్తేనే బుద్ధి వస్తుంది” అని రాసుకొచ్చాడు. అయితే ఆ తర్వాత అతడు చేసిన వ్యాఖ్యలు భారతీయులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి.చదువు, సంస్కారం లేదు.. పక్కా పల్లెటూరోడు.. వైభవ్ పై నోరు పారేసుకున్న లంక మేనేజర్ ఇండియా-ఏ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ శ్రీలంక-ఏ మ్యాచ్ అనంతరం వివాదంలో చిక్కుకున్నాడు. మైదానంలో తోపులాట తర్వాత శ్రీలంక మాజీ మేనేజర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. వైభవ్ సూర్యవంశీ ప్రత్యర్థిని నెట్టేయడంపై, లంక మాజీ మేనేజర్ పల్లెటూరి కుర్రాడు అంటూ వ్యాఖ్యానించాడు. మైదానంలో ఆటగాళ్ల మధ్య గొడవలు, స్లెడ్జింగ్ సహజమే అయినప్పటికీ ఒక్కోసారి అవి హద్దులు దాటి పెద్ద వివాదాలకు దారితీస్తుంటాయి. ప్రస్తుతం శ్రీలంక వేదికగా జరుగుతున్న ట్రై సిరీస్‌లో భారత యువ ఓపెనర్, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆట కంటే ఎక్కువగా తన ప్రవర్తనతో నెగటివ్ వార్తల్లో నిలిచాడు.

## కాంబ్లీ నుంచి కోహ్లీ వరకు..

# ముంబై టాప్ ఏరియాల్లో ఖరీదైన ఇళ్లు!




విరాట్ కోహ్లీ ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆటగాళ్ల జాబితాలో ఒకరు. ఒక నివేదిక ప్రకారం కోహ్లి నికర ఆస్తుల విలువ వెయ్యి కోట్లు దాటింది. కోహ్లి వార్షిక ఆదాయమే వందల కోట్లలో ఉంటుంది. అతని వద్ద ఖరీదైన కార్లు ఎన్నో ఉన్నాయి. దీంతో పాటు కోహ్లీకి అనేక బ్రాండ్‌లతో టై-అప్‌లు ఉన్నాయి. కోహ్లికి గురుగ్రామ్‌లో బంగ్లా ఉంది. దాని ధర దాదాపు రూ.80 కోట్లు. వర్లిలోని మరో ప్రతిష్ఠాత్మక ‘ఓంకార్ 1973’ టవర్ అయితే ఇద్దరు స్టార్ క్రికెటర్లకు నిలయంగా మారింది. ఇందులో విరాట్ కోహ్లీ రూ.34 కోట్లతో 7,000 చదరపు అడుగుల భారీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేయగా, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఏకంగా రూ. 64 కోట్లతో 16,000 చదరపు అడుగుల డ్యూప్లెక్స్ ఫ్లాట్‌ను సొంతం చేసుకున్నాడు. ముంబైలోని వర్లి ప్రాంతం ఆధునిక లగ్జరీకి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడి ‘అహుజా టవర్స్’లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఉంటున్నాడు. 29వ అంతస్తులో ఉన్న ఈ 4 ఫ్లాట్ నుంచి అరేబియా సముద్రం 270 డిగ్రీల కోణంలో కనువిందు చేస్తుంది. దీని విలువ సుమారు రూ. 30 కోట్ల నుంచి 40 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. ఒకవైపు వర్లి ఆకాశహర్మ్యాలతో పోటీ పడుతుంటే, మరోవైపు బాంద్రా ఎప్పటినుంచో సెలబ్రిటీలకు అడ్డాగా ఉంది. ఇక్కడి పెర్రీ రోడ్‌లో సచిన్ కుటుంబం నివసిస్తోంది. 2007లో కొనుగోలు చేసిన ఈ చారిత్రక బంగ్లాను, ఆయన తన అభిరుచికి అనుగుణంగా సచిన్ తీర్చిదిద్దుకున్నాడు. 6,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ బంగ్లా ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైమాటే. ఇదే బాంద్రాలోని పాలి హిల్‌లో కేఎల్ రాహుల్ రూ. 20 కోట్ల విలువైన ఫ్లాట్‌లోనూ, బాంద్రా వెస్ట్‌లోని ‘జ్యూయల్ టవర్’లో వినోద్ కాంబ్లీ రూ.8 కోట్ల అపార్ట్‌మెంట్‌లోనూ నివసిస్తున్నారు. ఆటతో కోట్లాది మంది అభిమానులను సంపాదించడమే కాదు.. తమ సంపాదనతో ముంబై వంటి మహానగరంలో అత్యంత ఖరీదైన ఆస్తులనూ కూడబెట్టారు భారత క్రికెట్ స్టార్లు. వారి విజయాలకు, విలాసవంతమైన జీవనశైలికి ప్రతీకగా నిలుస్తున్న ఈ గృహాలు ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో కొలువై ఉన్నాయి. మొత్తం మీద, ఈ క్రికెటర్ల ఇళ్లు కేవలం నివాస స్థలాలు మాత్రమే కాదు. వారి అద్భుత విజయాలకు, సంపదకు, పెట్టుబడి నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తూ ముంబై రియల్ ఎస్టేట్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.

# ఆ రోజులు మళ్ళీ రావు..
# ఈ రోజుల్లా కానే కావు...

## డియర్ జన్ జీ.. మీకు తెలియదు మా నైన్టీస్ కిడ్స్ లగ్జరీ..

**పాత మట్టి ఇళ్లు, వర్షం కురిసే వేళ కాగితపు పడవ ఆటలు... 90ల నాటి పల్లె జీవితం, మన చిన్ననాటి జ్ఞాపకాలు. ఎండలో మట్టి ఇంటి సహజసిద్ధమైన చల్లదనం, వానలో మట్టి వాసన, అరుగులపై కబుర్లు, నేరేడు పండ్ల రుచి - ఇవన్నీ ఇప్పుడు ఎంత కోరుకున్నా దొరకని ఆత్మీయతను, ప్రశాంతతను అందిస్తాయి. ఆధునికతలో కోల్పోయిన ఆ మధురానుభూతులను ఈ కథనంలో గుర్తు చేసుకుందాం ...**



నేటి ఆధునిక యుగంలో మనం అపార్ట్‌మెంట్లు, ఏసీ గదుల్లో నివసిస్తున్నప్పటికీ, 90వ దశకంలోని మన చిన్ననాటి పల్లె జ్ఞాపకాలు, మట్టి ఇళ్లు, వర్షాకాలపు ఆటలు మనసులో చెరగని ముద్ర వేసుకున్నాయి. కరెంటు పోతే ఉక్కపోతతో సతమతమవుతున్నప్పుడు, ఆ మట్టి ఇళ్ల చల్లదనం ఎంత గొప్పదో గుర్తుకు వస్తుంది. ఆ మట్టి ఇళ్లు కేవలం గోడలు, కప్పు మాత్రమే కాదు, అవి ఆత్మీయతకు, ఆనందానికి నిలయాలు.

**మట్టి ఇళ్ల చల్లదనం, ఆరోగ్యం:**

ఎండకాలంలో సూర్యుడు మండుతున్నప్పుడు మట్టి ఇళ్లలోకి దూరితే చాలు, ఏసీలు, కూలర్లు లేకపోయినా అరికాళ్ల నుంచి నెత్తి దాకా అమృతం లాంటి చల్లదనం అనుభవమయ్యేది. లావుపాటి మట్టి గోడలు, పెంకుటి కప్పులు సూర్యుడి వేడిని లోపలికి రానిచ్చేవి కావు. మధ్యాహ్నం పూట ఆ చల్లటి మట్టి నేల మీద ఈత చాప వేసుకుని పడుకుంటే, ఫైవ్ స్టార్ హోటల్ బెడ్ మీద కూడా దొరకని సుఖం అది. అంతేకాదు, వసారా మూలన ఉన్న మట్టి కుండలోని నీళ్లు తాగితే గొంతులోంచి ప్రాణం లేసొచ్చేది. ఫ్రిజ్‌లో ఐస్ నీళ్లు తాగి గొంతు నొప్పులు తెచ్చుకుంటున్న ఈ రోజుల్లో, ఆ మట్టి కుండ నీళ్లే మనకు థమ్సప్, పెప్సీలు. వారానికోసారి అమ్మమ్మలు, నానమ్మలు ఇల్లు అలికినప్పుడు వచ్చే ఆ పచ్చి మట్టి వాసన, ఎంత ఖరీదైన పర్ఫ్యూమ్ కన్నా గొప్ప అనుభూతిని ఇచ్చేది. ఆ మట్టి గోడల ఆరోగ్యకరమైన స్పర్శ, అవి అందించిన ప్రశాంతత ఇప్పుడు ఎక్కడా లేదు.

**వర్షం ముచ్చట్లు, ఆటలు:**

జూన్ నెల రాగానే వాతావరణం మారిపోయేది. నల్లటి మబ్బులు ఆకాశాన్ని కమ్మేసి, ఉరుములు, పెద్ద పెద్ద గాలి వానలు మొదలయ్యేవి. మొదటి వాన చినుకు ఎండిపోయిన మట్టి నేల మీద పడగానే వచ్చే కమ్మటి వాసన, మనసును చిన్ననాటి జ్ఞాపకాల్లోకి లాక్కెళ్లేది. మట్టి ఇళ్లలో వర్షాకాలం అంటే అదొక పెద్ద అడ్వెంచర్ గేమ్. పాత పెంకుటి ఇళ్లలో ఎక్కడో ఒక చోట చినుకు పడినప్పుడు గిన్నెలు, డబ్బాలు పెట్టి, టప్ టప్ మ్యూజిక్‌ను వింటూ మురిసిపోయేవాళ్ళం. వాన తగ్గగానే వీధిలోకి పరుగు తీసి, పాత నోట్‌బుక్ పేజీలతో కాగితపు పడవలు చేసి, వర్షపు నీటి కాలువల్లో వదిలి పందాలు వేసుకునేవాళ్లం. బురదలో కాళ్లు పెట్టి తొక్కుతూ, ముఖం మీద బురద పడినా నవ్వుకుంటూ ఆడుకున్న ఆ రోజులు ఎంత ఆనందాన్ని ఇచ్చాయో! అప్పట్లో ఆ బురదలో ఆడుకున్నా ఏ రోగాలు వచ్చేవి కావు, ఎందుకంటే ఆ మట్టిలో అంత అమృతం ఉండేది. వాన పడి వెలిసిన తర్వాత ఆకాశంలో సూర్యుడో, చంద్రుడో మనతో పాటే వస్తున్నట్లు అనిపించే ఆ అమాయకత్వం, ఇప్పుడు కోట్లు పెట్టినా దొరకని ఆనందాన్ని ఇచ్చేది.

**పల్లె జీవితం, ఆత్మీయత:**

వర్షాకాలం ఆరంభంలో ఊరి చివర ఉన్న నేరేడు చెట్ల పళ్ళు రాలితే, బురదలో పడిన వాటిని కూడా ఏరుకుని, చొక్కాకి తుడుచుకుని తినడం ఒక పెద్ద సంబరం. నాలుకంతా వంకాయ రంగులోకి మారితే, అందరికీ చూపించి వెక్కిరించుకునే ఆ ఆనందం ఇప్పుడు ఏ ఆపిల్స్, కివీస్ ఇవ్వలేవు. మట్టి ఇళ్ల గోడలలో ఉండే చిన్న చిన్న గూళ్లు, తాతయ్య కళ్లద్దాలు, అమ్మమ్మ దాచుకున్న నాణేలు, మనం దాచుకున్న గోలీలు, బొంగరాలు దాగుండే పెద్ద ట్రెజర్ హంట్ అవి. సాయంత్రం చీకటి పడగానే ఆ గూట్లోనే కిరోసిన్ దీపమో, లాంతరో వెలిగించి, దాని వెలుగులో గోడ మీద నీడలతో బొమ్మలు చేసుకుంటూ, దెయ్యంలా భయపెట్టుకుంటూ ఆడుకున్న రాత్రులు మధురమైనవి. ఆ లాంతరు దీపాల వెనుక ఉన్న ఆత్మీయత ఇప్పుడు వేల వాట్ల ↄజుణ లైట్లలో వెతికినా దొరకదు. పండుగలప్పుడు ఆవు పేడతో కల్లాపి చల్లి, బియ్యప్పిండితో పెద్ద పెద్ద ముగ్గులు పెడితే, ఆ ఇళ్లలో లక్ష్మీ కళ, ప్రశాంతత వెల్లివిరిసేది. మట్టి ఇళ్ల ముందు ఉండే పెద్ద అరుగులు, ఊర్లో వాళ్ళంతా కలిసి ముచ్చట్లు తలుచుకుంటూనే కళ్ల వెంట నీళ్లు తిరుగుతాయి. ఒకరి కష్టసుఖాలు ఇంకొకరు పంచుకుంటూ, ఆత్మీయతతో బ్రతికిన ఆ పల్లె జీవితం ఎప్పటికీ మన గుండెల్లో పదిలంగా ఉంటుంది.

# అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!





అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత వంద రోజులకు పైగా కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వెనుక ఖతార్ జరిపిన నిరంతర, రహస్య దౌత్యం కీలక పాత్ర పోషించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒప్పందంతో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు, అణు చర్చల పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది. ఈ ఒప్పందంపై త్వరలోనే తటస్థ వేదికైన జెనీవాలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం నిబంధనల ప్రకారం, ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. దీనితో పాటు, ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం కలిగించిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. కొన్ని ధ్రువీకరించదగిన చర్యలకు ప్రతిఫలంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను దశలవారీగా సడలించేందుకు కూడా అంగీకారం కుదిరింది. 2026 ప్రారంభం నుంచి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య చోటుచేసుకున్న సైనిక చర్యలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. చర్చల ప్రారంభ దశలో పాకిస్థాన్ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య సంప్రదింపులకు వేదిక కల్పించింది. అయితే, అణు పరిమితులు, యురేనియం నిల్వలు వంటి క్లిష్టమైన సాంకేతిక అంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఖతార్ రంగంలోకి దిగింది. అమెరికా, ఇరాన్ దేశాలతో సత్సంబంధాలు కలిగిన ఖతార్ రాయబారులు, ఇరు దేశాల మధ్య రహస్య మంతనాలు జరిపి, ఒప్పందంలోని సంక్లిష్టాంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో సఫలమయ్యారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు, నావికాదళ దిగ్బంధనాన్ని సడలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. నెలల తరబడి కొనసాగిన అనిశ్చితి తర్వాత ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగుగా దౌత్యవేత్తలు భావిస్తున్నారు.

Printed, Published and Owned by J BHASKER, and Printed at Sunday Printing Press, H.No.361, Bhagyalaxmi Colony, Quthbullapur, MEDCHAL MALKAJGIRI, Telangana- 500054. and Published from H.No.3-87, Gangaram, Marepalli, Kondapur, SANGAREDDY, TELANGANA - 502306.. Editor: J BHASKER. PRGI NO : TGTEL/25/A3369 Email: samastaprakshalanam@gmail.com. Phone No: 9959479375, 9398191920.